శనివారం
1-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 131
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

5 వరకు గంగా హారతి నిలిపివేత

లక్నో: కుంభమేళకు భక్తుల రద్దీ దృష్ట్యా ఫిబ్రవరి 5 వరకు ఘాట్‌ల వద్ద గంగా హారతి నిలిపివేస్తున్నట్లు ఉత్తరప్రదేశ్ అధికారులు ప్రకటించారు. వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్ల, అస్సీ మొదలైన ఘాట్‌లలో గంగా హారతిని నిలివేస్తున్నామన్నారు. ఘాట్‌ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. వారణాసికి భక్తులు పోటెత్తిన కారణంగా వారణాసి, బనారస్ రైల్వే స్టేషన్‌లలో కొందరు చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. మౌని అమావాస్య నుంచి భక్తుల రద్దీ పెరిగిందని, పరిస్థితి కాస్త నియంత్రణలోకి వచ్చేంత వరకు ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: మరో ఐదు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న వేళ ఢిల్లీలో కేజ్రీవాల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీతో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న అత్యంత కీలక సమయంలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పాలం ఎమ్మెల్యే భావనా గౌర్, మదన్‌లాల్... ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. 'మీ పట్ల, పార్టీ పట్ల విశ్వాసం కోల్పోయాను. అందువల్లే ఈ నిర్ణయం

- మిగతా 2 లో

ఎమ్మెల్యేల అనర్హతకు ఎంత సమయం కావాలి?

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత అని నిలదీసింది. రీజనబుల్ టైమ్ అంటే మహారాష్ట్ర తరహాలో

- మిగతా 2 లో

నలుగురికి 20 ఏళ్ల జైలు

చెన్నై: వైద్యురాలిపై సామూహిక అత్యాచారం కేసులో తమిళనాడు మహిళా కోర్టు నలుగురు నిందితులకు 20 సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష, ఒక్కొక్కరికి రూ.25 వేల జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. 2022లో మహిళా వైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వివిధ పార్టీల సభ్యులు ఇదే అంశాన్ని శాసనసభలో లేవనెత్తారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. వివరాలివి. మార్చి 16, 2022న,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సామాన్యులపై ధరల భారం
రెట్టింపు

- జీడీపీ వృద్ధి 6.4 శాతం... నాలుగేళ్లలో అత్యల్పం
- 2025-26లోనూ 7శాతం లోపే
- ఆర్థిక సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ దేశ ఆర్థికవ్యవస్థ ధృడంగా ఉందని ఆర్థికసర్వే భరోసా ఇచ్చింది. అదే సమయంలో నిత్యావసరాల ధరల భారం సామాన్యులపై రెట్టింపు అయిందని ఆర్థికసర్వే స్పష్టం చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధి 7 శాతం లోపే ఉంటుందని పేర్కొంది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2024-25 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం పూర్తయిన తర్వాత ఆమె ఆర్థిక సర్వేను సభ ముందు ఉంచారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను శనివారానికి వాయిదా

- మిగతా 2 లో

మణిపూర్ ఊసే లేదు

గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా భారత్
పార్లమెంటులో రాష్ట్రపతి స్వోత్కర్ష

8లో

ఫామ్‌హౌస్ వీడి అసెంబ్లీకి వస్తే
లెక్కలు చెబుతాం

- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని రూ.7 లక్షల కోట్ల అప్పుతో అప్పగించారు
- అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ
- విద్యపై చేసేది ఖర్చుకాదు... భవిష్యత్‌పై పెట్టుబడి
- మొగిలిగిద్ద పాఠశాల వార్షికోత్సవంలో రేవంత్

విశాలాంధ్ర-షాద్‌నగర్ రూరల్: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ... 'రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్‌కు అప్పగిస్తే... రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు. గత ప్రభుత్వం రూ.18 వేల కోట్లే రుణమాఫీ చేసింది. తాము అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం. ఫామ్‌హౌస్‌లో ఉండి సోది చెప్పటం కాదు... అసెంబ్లీకి రండి లెక్కలు చెబుతాం. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో శాసనసభలో పెడతాం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. రైతు భరోసా ఎగ్గొడతారని కేసీఆర్ చెబుతున్నారు. మీలా మాట తప్పే వ్యక్తిని కాదు. దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి... ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారు' అని ధ్వజమెత్తారు. 'కేసీఆర్

- మిగతా 2 లో

కాషాయ పాలనలో
ప్రజాస్వామ్యం ధ్వంసం

- బీజేపీని గద్దె దింపేందుకు మార్చి 23 నుంచి రాజకీయ ప్రచారోద్యమం
- సెప్టెంబరు 21-25 చండీగఢ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు
- డిసెంబరు 24, 25న విజయవాడలో అంతర్జాతీయ సదస్సులు
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

విశాలాంధ్ర-విశాఖపట్నం: కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగు తోందని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తూ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడు తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని... దీనికోసం వామపక్ష, లౌకిక పార్టీలతో కలిసి పనిచేస్తామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. విశాఖలో గురు, శుక్రవారాల్లో సీపీఐ జాతీయ కార్యవర్గ సమావే శాలు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజా మాట్లాడుతూ బీజేపీ ప్రజావ్యతిరేక పాలనపై భగత్ సింగ్ వర్థంతి రోజైన మార్చి 23వ తేదీ నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తా మని తెలిపారు. ఇందులో భాగంగా జాతాలు, ప్రదర్శనలు, సభలు, సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. దేశంలో ప్రజల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలంటే కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి గద్దె దించాలని రాజా అన్నారు. సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా విజయవాడలో డిసెంబర్ 24, 25 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని, దీనికి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 26న శతవార్షికోత్సవాల ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, విదేశీ అప్పు 700 బిలియన్ డాలర్లకు చేరుకుందని, రూపాయి విలువ భారీగా పడిపోతోందని, నిరుద్యోగం పెరిగి యువతలో నిస్పృహ అలుముకుంటోందని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. బీజేపీ చెబుతున్న వికసిత్ భారత్ ఎక్కడా కనిపించడం లేదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ల సేవలో మునిగితేలుతోందని మండిపడ్డారు. కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని..కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. బీజేపీ పాలనలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉందన్నారు. దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ పై పార్లమెంటులో

- మిగతా 2 లో

సచిన్‌కు బీసీసీఐ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను భారత క్రికెట్ బోర్డు ఘనంగా సత్కరించనుంది. శనివారం జరగబోయే వార్షికోత్సవంలో సచిన్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం' అందజేయనున్నట్లు పీటీఐకి బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. 'సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును సచిన్‌కు ప్రదానం చేయనున్నాం. భారత క్రికెట్‌కు ఆయన అందించిన సేవలు అమోఘం' అని పేర్కొన్నాయి. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు సృష్టించిన సచిన్‌కు అవార్డు ప్రకటనపై ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. ఈ పురస్కారం స్వీకరించబోయే 30వ భారత క్రికెటర్ సచిన్. గతేడాది భారత మాజీ కోచ్ రవిశాస్త్రి, మాజీ క్రికెటర్ ఫరూఖ్ ఇంజినీర్‌ను ఈ అవార్డు వరించింది. కాగా, భారత్ తరపున 664 మ్యాచ్‌లు ఆడిన ఏకైక క్రికెటర్ సచిన్. సచిన్ మొత్తం 34,357 పరుగులు చేశాడు. ఇందులో 100 సెంచరీలు, 201 వికెట్లూ ఉన్నాయి. 51 ఏళ్ల ఈ క్రికెట్ దిగ్గజం 2011 వన్డే ప్రపంచ కప్ నెగ్గిన జట్టులో సభ్యుడు. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

- మిగతా 2 లో

కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజాపోరాటాలు

- ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభ
- ఆత్మీయ సమావేశంలో కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ ప్రజల సమస్యలు... కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రత్యక్ష ప్రజాపోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు (కేసీఆర్) పిలుపునిచ్చారు. తెలంగాణ కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మేలు జరిగే వరకు తమ పార్టీ రక్షణ కవచంలా నిలుస్తుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం జరాసంగం మండలం మేదపల్లి నుంచి వందలాది మంది ఉద్యమకారులు, ఆ పార్టీ నాయకులు, అభిమానులు ఐదు రోజులుగా 140 కిలోమీటర్లు పాదయాత్ర చేసి శుక్రవారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణను అగ్రభాగాన నిలిపామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల పాలనలోనే తెలంగాణను నాశనం చేస్తూ ప్రజలను అరిగోస పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాజెక్టుల ద్వారా సాగు నీళ్లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీళ్లు ఇచ్చుకున్నం, నీటి తీరువా రద్దు చేసినం, చెరువులు బాగు చేసినం, మల్లన్న సాగర్ వంటి ఎన్నో రిజర్వాయర్లు నిర్మించుకున్నామన్నారు. రైతు బీమాతో మృతుడి కుటుంబాన్ని ఆదుకున్నామని తెలిపారు. గొర్రెల కాపరులకు గొర్రెల పంపిణీ చేశామని, కరోనాలో రైతు బంధు ఆపకుండా ఇచ్చామని చెప్పారు. తమ హయాంలో ప్రతి ఏటా రూ.15 వేల కోట్ల ఆదాయం పెరిగేదని, ఇప్పుడు పదమూడు వేల కోట్ల ఆదాయం తగ్గిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించిందని గుర్తు చేశారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనాలు ఇవ్వలేరని కేసీఆర్ పేర్కొన్నారు. గురుకులాల నిర్వహణను కాంగ్రెస్ అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. ఇమామ్‌లు మౌజంలకు కనీసం వేతనాలు ఇవ్వాలనే ఆలోచన కూడా కాంగ్రెస్ వాళ్లకు రాలేదన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టులను మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ఆపి రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ శక్తి ఏందో చూపెట్టడానికి ఫిబ్రవరిలో బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్ ఏడాది పాలన సమీక్షిస్తామని చెప్పారు. భూముల ధరలు పడిపోతున్నాయని, తమ హయాంలో మారుమూల ప్రాంతంలో ఎకరం రూ. 40 నుంచి 50 లక్షలు విలువ ఉందన్నారు. ప్రజా పోరాటాల్లో తాను కూడా పాల్గొంటా అని పేర్కొన్నారు.

పరమేశ్వర్ పాటిల్, బోయిని చంద్రయ్య, ప్రశాంత్, బోయిని శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు కేసీఆర్‌ని సత్కరించారు. కేసీఆర్ ను చూడాలని, కలవాలని, మాట్లాడాలని నాయకులు, అభిమానులు రావడం అభినందనీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు మాణిక్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ



రేవంత్‌కు కూనంనేని లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శాసనసభలో ప్రత్యేక చర్చ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ఆయన ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక లేఖ రాశారు. పంచాయతీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌ల పెంపుపై ఫిబ్రవరి 7న అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఆ సమావేశాలలో భాగంగానే 'రాజ్యాంగం, దాని అమలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై ప్రత్యేక చర్చ నిర్వహించాలని లేఖలో కోరారు. రాజ్యాంగంపై చర్చకు ఒక రోజు కేటాయించడం సముచితమన్నారు. తెలంగాణ శాసనసభాపతి, శాసనసభ వ్యవహారాల శాఖాధికారికి కూడా ఇదే లేఖను కూనంనేని పంపారు.



సాయుధ పోరాట సేనానులు - 4

"ఆయన రోడ్డుపై నడుస్తుంటే హైదరాబాద్ చరిత్ర నడిచినట్టుంది" అని డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్ గురించి ప్రముఖ కవి జ్వాలాముఖి అనేవారు. డా. గౌర్‌ది బహుముఖీనమైన వ్యక్తిత్వం. చదివింది వైద్య శాస్త్రం. అదీ ఉర్దూ మాధ్యమంలో. కానీ విద్యార్థి దశలోనే విప్లవ కార్యాచరణ ఆయన ప్రవృతిగా మారినందువల్ల వైద్య వృత్తి చేపట్టకూడదనుకున్నారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- 'సెయింట్ ఫ్రాన్సిస్' కళాశాల వార్షికోత్సవంలో భట్టి

2లో

2027 ఎన్నికల్లో పోటీకి

'కమ్యూనిస్ట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ మెక్సికో'

మెక్సికో కమ్యూనిస్టు పార్టీ ప్రకటన

మెక్సికో సిటీ: మెక్సికోలోని షెయిన్‌బౌమ్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మెక్సికో కమ్యూనిస్టు పార్టీ (పీసీఎం) సంకల్పించింది. 2027, 2030లో జరగబోయే ఎన్నికల్లో పోటీకి 'కమ్యూనిస్ట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ మెక్సికో' వేదికను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. పార్టీ కేంద్ర కమిటీ ఆరవ ప్లీనరీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు పీసీఎం ఒక ప్రకటనలో తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, మెక్సికో శ్రామిక వర్గ హక్కులు, 2025 కోసం పీసీఎం కార్యాచరణ ప్రణాళికపై ప్లీనరీ చర్చించినట్లు వెల్లడించింది. పెట్టుబడిదారీ దేశాల ఉచ్చులో పడవద్దని ప్రజలకు, శ్రామికులకు పిలుపునిచ్చింది. సిరియా వలే పరిస్థితిని కొని తెచ్చుకోవద్దని హెచ్చరించింది. తమకు మద్దతుగా నిలవాలని కోరింది. అదే సమయంలో అమెరికా సామ్రాజ్యవాద దౌర్జన్యాలకు, అణచివేతకు గురవుతున్న క్యూబా, వెనిజులా దేశాలకు సంఘీభావాన్ని ప్రకటించింది. గత ఒబ్రేడార్ ప్రభుత్వం కొనసాగింపుగా క్లాడియా షెయిన్‌బౌమ్ పరిపాలన సాగుతోందని పీసీఎం వ్యాఖ్యానించింది. ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, సైనికాధారిత, కార్పొరేట్ అనుకూల విధానాల అమలును ఆక్షేపించింది. సమాజాన్ని నియంత్రించే అస్త్రంగా సంక్షేమం మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. యూఎస్ఎంసీఏ ఆధారిత గుత్తాదిదారులకే షెయిన్‌బౌమ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టింది. 'సెకెండ్ ఫ్లోర్ ఆఫ్ ది ఫోర్త్ ట్రాన్స్‌ఫర్మేషన్'ను పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తున్నట్లు పీసీఎం ప్రకటించింది.

కొత్త కరెన్సీ తెస్తే 100 శాతం పన్నులేస్తాం

బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: కొత్త కరెన్సీని తెచ్చే ప్రయత్నాలను మానుకోవాలని బ్రిక్స్ దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. కాదు కూడదు అంటే 100శాతం పన్నులు విధిస్తామంటూ హెచ్చరించారు. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికన్ డాలర్‌ను తలదన్నే కరెన్సీ రావడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఆ దిశగా జరిగే ప్రయత్నాలను అణచివేస్తామన్నారు. అందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే పన్నులు, సుంకాలకు హాయ్ చెప్పి... అమెరికాకు గుడ్ బై చెప్పాల్సిందేనని ట్రూత్ మాధ్యమంగా ట్రంప్ హెచ్చరికలు చేశారు. 'డాలర్ వినియోగాన్ని ఆపేయాలన్నది బ్రిక్స్ దేశాల ఆలోచన. ఇందుకు అనుమతించబోం' అని అన్నారు. కొత్త కరెన్సీ సృష్టించే ఆలోచనను మానుకుంటామని, అమెరికా డాలర్‌ను దెబ్బతీసే విధంగా ప్రత్యామ్నాయ కరెన్సీ తీసుకు రాబోమని బ్రిక్స్ దేశాలు స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. లేనిపక్షంలో 100 శాతం పన్నులు వారికి తప్పబోవని, అమెరికాతో వాణిజ్యానికి స్వస్తి పలకాల్సి ఉంటుందని ట్రంప్ బెదిరించారు.

మైన్మార్, టునీసియాలో ఎమర్జెన్సీ పొడిగింపు

యంగాన్/టునిస్: మైన్మార్, టునీసియా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమల్లో ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలాన్ని మరింత కాలం పొడిగిస్తూ ఆ దేశాల ప్రభుత్వాలు తాజాగా ప్రకటనలు చేశాయి. తమ దేశంలో అత్యవసర పరిస్థితి మరో ఆరు నెలలు కొనసాగనున్నట్లు మైన్మార్ జాతీయ రక్షణ, భద్రతా మండలి (ఎన్‌డీఎస్‌సీ) తెలిపింది. నే పై తావ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిపింది. రాజ్యాంగంలోని సెక్షన్ 425 ప్రకారం ఎమర్జెన్సీని పొడిగించినట్లు వెల్లడించింది. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు శాంతి, సుస్థిరత నెలకొల్పే ఉద్దేశంతో ఈ మేరకు చర్యలను చేపట్టినట్లు అధికారులు చెప్పినట్లు మైన్మార్ రేడియో & టెలివిజన్ (ఎంఆర్‌టీవీ) నివేదించింది. ఎన్నికలకు సన్నద్ధత, వ్యవసాయ ఉత్పత్తి పెంచుకోవడం, విద్యా, ఆరోగ్య రంగాలలో జాతీయస్థాయి అభివృద్ధి వంటి అంశాలను ఎన్‌డీఎస్‌సీ చర్చించినట్లు ప్రకటన పేర్కొంది. విపత్తు అనంతరం కల్పించే పునరావాసం, సాయుధ ఘర్షణలకు ముగింపు పలకడం, శాశ్వత శాంతి సాధన దిశగా తీసుకోవాల్సిన చర్యలపైనా సమాలోచనలు జరిగినట్లు వెల్లడించింది. 2021 ఫిబ్రవరిలో మైన్మార్‌లో ఒక ఏడాది పాటు ఎమర్జెన్సీని ప్రకటించారు. ఇప్పుడు దానిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఇదిలావుంటే, 2025 చివరి వరకు ఎమర్జెన్సీని పొడిగిస్తూ టునీసియా అధ్యక్షుడు కైస్ సయీద్ ఒక ప్రకటన చేశారు. అధ్యక్షుడి గార్డుల బస్సుపై బాంబు దాడి అనంతరం 2015, నవంబరు 24న టునీసియాలో మొదటిసారి ఎమర్జెన్సీ విధించారు. అప్పటి దాడిలో 12 మంది ఏజెంట్లు చనిపోయారు. కాగా, టునీసియాలో ఎమర్జెన్సీ వేళ అధికారులకు కొన్ని అసాధారణ అధికారాలు ఉంటాయి. వాటిలో గృహ నిర్బంధాలు చేయడం, అధికారిక సమావేశాలు నిషేధించడం, కర్ఫ్యూ విధించడం, మీడియా, ప్రెస్‌ను పర్యవేక్షించడం, అసెంబ్లీలను రద్దు చేయడం, న్యాయ స్థానాల అనుమతి లేకుండా మీడియా సెన్సార్‌షిప్ అమలు చేయడం వంటివి ఉన్నాయి.

కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నా. దయచేసి నా రాజీనామాను ఆమోదించండి' అని భావనా గౌర్ తన లేఖలో పేర్కొన్నారు. మరోవైపు త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తూర్బానగర్ ఎమ్మెల్యే మదన్‌లాల్, మెహ్రౌలి ఎమ్మెల్యే నరేశ్ యాదవ్‌తో పాటు పవన్ శర్మ (ఆదర్శనగర్) బీఎస్ జూన్ (బిజ్వాసన్) ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేశారు. అయితే, ఈ ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు వీరెవరికీ టికెట్ ఇవ్వకపోవడం గమనార్హం.

సచిన్‌కు బీసీసీఐ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

పలికాడు. టెస్టుల్లో 15,921 పరుగులు, వన్డేల్లో 18,426 పరుగులు చేశాడు. ఒకే ఒక్క ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్ ఆడాడు. ప్రపంచ క్రికెట్‌లో ఎవరికీ సాధ్యం కాని రీతిలో ఆరుసార్లు వన్డే ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొన్నాడు. తన సుదీర్ఘమైన 24 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లు అందుకున్నాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన సాధించిన బ్యాటర్ సచిన్ టెండూల్కర్ మాత్రమే.

సీఐడీ మాజీ చీఫ్ సస్పెన్షన్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసు నిబంధనల ఉల్లంఘనపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌ను మే 31వ తేదీ వరకు పొడిగించింది. సంజయ్ సస్పెన్షన్‌ను కేంద్ర హోం శాఖ కూడా నిర్ధారించింది. సంజయ్ సస్పెన్షన్‌పై నియమించిన కమిటీ ఇటీవల భేటీ అయింది. ఆయనపై సస్పెన్షన్ పొడిగించాలని కమిటీ నిర్ణయించింది. సీఐడీ మాజీ చీఫ్‌గా, అగ్నిమాపక శాఖ డీజీగాఉన్న సమయంలో సంజయ్ అనేక అవకతవకలకు పాల్పడ్డారని, సుమారు కోటి 75లక్షల రూపాయలను దుర్వినియోగం చేశారని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఇచ్చింది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ఆయన కేసును ఏసీబీకి అప్పగించింది.

లెక్కలు చెబుతాం

(మొదటి పేజీ తరువాయి)

రద్దైన వెయ్యి నోటు లాంటి వారు. ఆయనకు విలువలేదు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు ప్రజలతో సంబంధాలు తెగిపోయినట్లున్నాయి. ప్రజలు తిరస్కరించినా మారలేదు. గత ప్రభుత్వం విద్యా శాఖను నిర్వీర్యం చేసింది. టీచర్ నియామకాలు జరగలేదు. బీఆర్ఎస్ పదేళ్లలో ఇవ్వలేని ఉద్యోగాలను ఏడాదిలో ఇచ్చాం. 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. తమ ప్రభుత్వం రాగానే వీసీలను నియమించాం. ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లకు పెంచామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యపై చేసేది ఖర్చు కాదని.. భవిష్యత్తుపై పెట్టుబడి అని సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను సైతం బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. సోషల్ మీడియాలో నాకంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయంటున్నారు. కేంద్రమంత్రి, సీఎంగా చేసిన కేసీఆర్ సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటే. మీరో... నేనో తేల్చుకుందాం. ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ అంటున్నారు. ఎవరూ బాధపడటం లేదు. రూ.రెండు లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ రూ.10లక్షలు, రైతు భరోసా పథకాలు అమలు చేస్తున్నాం' అని సీఎం వివరించారు. సాంకేతిక నైపుణ్యాలను పెంచాలని... యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రతాప్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, సీపీ అవినాశ్ మహంతి, డీఈఓ సుసింధర్ రావు, ఆర్డీవో సరిత పాల్గొన్నారు.

ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన భద్రతాబలగాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు అక్రమచొరబాటుకు యత్నించగా భద్రతాబలగాలు వారిని మట్టుబెట్టాయి. పూంచ్ సెక్టార్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ వద్ద గురువారం రాత్రి ఇద్దరు ముష్కరులు దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. భద్రతా బలగాలు వారిని అడ్డుకునేందుకు యత్నించగా, వీరి మధ్య భారీగా కాల్పులు జరిగాయి. భారత సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు టెర్రరిస్టులు మృతి చెందారు. ఎల్‌ఓసీ వద్ద రాత్రంతా కాల్పులు జరిగాయని, ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది.

కాషాయ పాలనలో ప్రజాస్వామ్యం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

హోంమంత్రి అమిత్ షా అవమానకరంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించామని, అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 31న వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం నిర్వహించాయన్నారు. అయినా ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై నోరు ఎత్తడం లేదని విమర్శించారు.

చత్తీస్‌గఢ్ ఎన్ కౌంటర్లపై సీపీఐ నిజ నిర్ధారణ కమిటీ నిజాలను నిగ్గుతేలుస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న మేధావులను జైలుకు పంపుతున్నారని, వారికి బెయిల్ కూడా రాకుండా చేస్తున్నారని, ప్రశ్నిస్తున్న గొంతులను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తోందని చెప్పారు. 1991 ప్రార్థన స్థలాల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు.

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు సీపీఐ పూర్తిగా వ్యతిరేకమని, కార్యవర్గ సమావేశాల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసినట్టు తెలిపారు. సీపీఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు చండీగఢ్ లో నిర్వహించనునట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించబోమని కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు ఇస్తామని కేంద్రం చెప్పలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కేంద్ర ప్రభుత్వం చూపించలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లౌకిక రాజ్యం విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ మైనారిటీలను రెండో శ్రేణి పౌరులుగా చూస్తోందని విమర్శించారు. ఖమ్మంలో పార్టీ శతవార్షికోత్సవాల ముగింపు సభ, డిసెంబర్ 24, 25 తేదీల్లో విజయవాడలో అంతర్జాతీయ సదస్సు ల విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగంలో కూడా కుంభమేళా ప్రమాదాలపై ప్రస్తావన లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై ధరల భారం రెట్టింపు

(మొదటి పేజీ తరువాయి)

వేశారు. ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలను చూసినట్లయితే... 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.3-6.8శాతంగా ఉండొచ్చునని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రైవేటు రంగ వినియోగం స్థిరంగా ఉంటుందని, వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితులు మందకొడిగా ఉంటాయని పేర్కొంది. రబీ పంట దిగుబడి బాగుంటే.. 2026 తొలి అర్ధభాగంలో ఆహార పదార్థాల ధరలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ -డిసెంబర్ మధ్య వినియోగదారుల ఆహార ధరల సూచిక 8.4 శాతానికి చేరుకుంది. ఇది 2024లో 7.5 శాతంగా ఉంది. కూరగాయలు, పప్పుల ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం పెరిగింది. ఖరీఫ్ పంట రావడంతో ఆహార పదార్థాల ధరలు తగ్గడం వల్ల 2024-25 నాలుగో త్రైమాసికంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చునని సర్వే పేర్కొంది. ఇక 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టొచ్చునన్న ఆర్థిక సర్వే... భౌగోళిక రాజకీయ అనిశ్చితుల రూపంలో ఇంకా ముప్పు పొంచే ఉందని హెచ్చరించింది. ప్రభుత్వ మూలధనం పెరగడం, వ్యాపార అంచనాలు మెరుగుపడటంతో పెట్టుబడులు పుంజుకుంటాయని వెల్లడించింది. దేశీయంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయంగా బలహీన డిమాండ్ నేపథ్యంలో గతేడాది తయారీ రంగం ఒత్తిడికి గురైందని తెలిపింది. తయారీ రంగం నెమ్మదించడం, కార్పొరేట్ పెట్టుబడులు తగ్గడంతో 2024-25లో భారత వృద్ధి రేటు 6.4శాతానికి పరిమితం కావొచ్చునని అంచనా వేసింది. గత నాలుగేళ్ల కాలంలో ఇదే అత్యల్పం. 2023-24లో వృద్ధి రేటు 8.2శాతంగా ఉండగా.. 2022-23లో 7.2శాతం, 2021-22లో 8.7శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఐపీఓ లిస్టింగ్‌లు గణనీయంగా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ లిస్టింగ్‌ల్లో మన వాటా 30శాతంగా ఉంది. 2023తో పోలిస్తే ఇది 17శాతం ఎక్కువని సర్వే తెలిపింది. గత ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినందున భారీ మౌలికవసతుల రంగాల్లో కేంద్ర మూలధన వ్యయం 2020 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 38.8శాతం పెరిగినట్లు సర్వే పేర్కొంది.

2024-25 ఆర్థిక సంవత్సరంలో 5853 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని, జల్ జీవన్ మిషన్ కింద ఇప్పటివరకు 12 కోట్లకు పైగా కుటుంబాలకు కొళాయిల ద్వారా తాగు నీరు సదుపాయం కల్పించినట్లు సర్వే వెల్లడించింది. కాగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో ప్రయోజనాలు ఎంత ఉన్నా దాని విపరిణామాల పట్ల చాలా మందిలో ఆందోళన ఉందని తెలిపింది. ఆరోగ్య సంరక్షణ, పరిశోధన నుండి ఆర్థికాంశాలు, విద్య వరకు ఆర్థికంగా విలువైన చాలా పనులను ఆటోమేట్ చేయడం ద్వారా పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులు తెస్తామని ఏఐ డెవలపర్‌లు హామీ ఇస్తున్నప్పటికీ, ఈ పురోగతి గణనీయమైన విపరిణామాలనూ తీసుకురావచ్చని ఆర్థిక సర్వే 2024-2025 హెచ్చరించింది.

కాగా శనివారం (ఫిబ్రవరి 1న) కేంద్ర వార్షిక బడ్జెట్‌ను నిర్మల లోక్‌సభకు సమర్పించనున్నారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఆర్థిక సర్వే. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒకరోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వాటి అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భట్టి మాట్లాడుతూ... ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో పాఠశాలను రూ. 200 కోట్లతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 60 స్కూళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని అన్నారు. మహిళలకు విద్య అందిస్తే ... కుటుంబానికి, సమాజానికి మేలు జరుగుతుందని వివరించారు. మహిళలకు ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు, విద్యార్థినులకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయిస్తామన్నారు. పెట్టుబడులకు బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించడం, వీరు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దబోతున్నామని వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామన్నారు. వారి తరఫున వడ్డీని ఆర్థిక శాఖ చెల్లిస్తుందని వివరించారు. 1959లో 15 మంది విద్యార్థినులతో ప్రారంభమైన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రస్తుతం మూడువేల మందికి నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థినిలు గొప్ప ప్రతిభను కనబరుస్తున్నారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ తర్వాత డీఎస్సీ: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఉపాధ్యాయ నియామకాల భర్తీకి నిర్వహించే డీఎస్సీ నోటిఫికేషన్‌పై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టత ఇచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. మార్చిలో ప్రక్రియ ప్రారంభించి విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టీచర్ల భర్తీ పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, నవ్యాంధ్రలోనూ 80 శాతంపైగా టీచర్ల నియామకం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే చేపట్టినట్లు వివరించారు. ఉపాధ్యాయ సంఘాలతో నిత్యం సంప్రదింపులు కొనసాస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ టీచర్ల అభిప్రాయ సేకరణ ఉంటోందన్నారు. ప్రతి శుక్రవారం కమిషనర్... ఉపాధ్యాయ సమస్యలపై, ఆయా సంఘాల నేతలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. టీచర్ల బదిలీ పారదర్శకంగా ఉండేందుకు ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొస్తున్నామన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.మూడు వేల కోట్లు పెట్టి దిగిపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తొలి విడతగా రూ.800 కోట్లు చెల్లింపులు చేశామన్నారు. రైతుల ధాన్యం బకాయిలు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిలు అన్నీ తామే తీరుస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపవుట్స్ నివారణకు ప్రత్యేక వ్యవస్థ తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంఖ్య ఖచ్చితత్వాన్ని తెలుసుకునేందుకు ఆపార్ కార్డ్ విధానం తెస్తున్నామని మంత్రి తెలిపారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి సంతకాల్లో 16 వేలకుపైగా పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఒకటి. ఏడు నెలలుగా ఉపాధ్యాయ అభ్యర్థులు వేచిచూస్తున్నారు. రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎన్నికల ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగుతుంది. అప్పటివరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. మంత్రి స్పష్టతతో నిరుద్యోగుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

పనిగంటలు పెరిగితే...అనారోగ్యమే

ఆర్థిక సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: ఎక్కువ గంటలు పని చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. కార్యాలయాల్లో రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం గడుపుతున్న ఉద్యోగుల్లో మానసిక రుగ్మతలు ఏర్పడే అవకాశమున్నట్లు పేర్కొంది. ఉద్యోగుల పని గంటల పెంపు అంశంపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న క్రమంలో ఈ అంశంపై ఆర్థికసర్వే వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా ఉత్పాదకతకు పని గంటలనే కొలమానంగా పరిగణిస్తుంటారు. అంటే ఎంత ఎక్కువ సమయం పని చేస్తే... ఫలితం అంత ఎక్కువగా వస్తుందని అంచనా. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ,అంతర్జాతీ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) అధ్యయనాల ప్రకారం.. వారానికి 55 నుంచి 60 పని గంటలు దాటితే సదరు ఉద్యోగి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మానసికంగా కుంగిపోయే అవకాశముంది. ఇదే విషయాన్ని 2024-25 ఆర్థిక సర్వే కూడా పేర్కొంది. ఈ సందర్భంగా మానవుడి మెదడు, మనసుపై సపియన్ ల్యాబ్స్ సంస్థ చేసిన పరిశోధనను ఆర్థిక సర్వే ఉటంకించింది. ఎవరైతే కార్యాలయాల్లో రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం పని చేస్తారో వారి మానసిక స్థితి, సాధారణ సమయం పని చేసేవారి కన్నా 100 పాయింట్లు తక్కువగా ఉంటుందని వెల్లడించింది. మరోవైపు ఆఫీసు వాతావరణం, సహోద్యోగులతో సత్సంబంధాలు కూడా ఉత్పాదకతను ప్రభావితం చేస్తాయని ఆర్థిక సర్వే తెలిపింది. నెలకు కనీసం రెండు, మూడు రోజులు కుటుంబ సభ్యులు, బంధువులతో గడపడం వల్ల ఉద్యోగుల్లో ఒత్తిడి, మానసిక సమస్యలు తొలగి.. మెరుగైన జీవనశైలి సాధ్యపడుతుందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలతో దేశ వ్యాప్తంగా 'పని గంటలపై' చర్చ మొదలైంది. అనేకమంది ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు, సినీనటులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడికి కొన్ని రోజుల తర్వాత ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కూడా అనేకమార్లు ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటల చొప్పున పని చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు, టెక్ సీఈవోలు కూడా దీనిపై స్పందిస్తూ భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తపర్చారు. అప్పుడప్పుడూ ఈ తరహా వాదనలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా ఆర్థిక సర్వే విశ్లేషణ వారి వ్యాఖ్యలను తిరస్కరించినట్లయింది.

నలుగురికి 20 ఏళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లూరులో మహిళా వైద్యురాలు తన స్నేహితుడితో కలిసి సినిమాకి వెళ్లింది. సినిమా చూశాక అర్ధరాత్రి ఇద్దరూ థియేటర్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ఆటో అటువైపుగా వచ్చింది. ఆ ఆటోలో నలుగురు వ్యక్తులు ఉన్నారు. వైద్యురాలు డ్రైవర్‌ని ఆసుపత్రి వరకు వెళ్లాలని చెప్పింది. ఆ తర్వాత ఆటో ఎక్కి బయలుదేరింది. కొద్దిసేపటి తర్వాత డ్రైవర్ ఆసుపత్రికి వెళ్లే మార్గం కాకుండా.. మరో మార్గంలో వెళ్లడంతో పాటు ఆటోను వేగంగా నడపడం మొదలుపెట్టాడు. ఎందుకు వేరే రూట్‌లో వెళుతున్నామని ఆమె డ్రైవర్‌ను ప్రశ్నించగా... రాత్రి సమయంలో ఆ మార్గం మూసి ఉంటుందని చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత శ్మశానవాటిక సమీపంలో నిర్జన ప్రదేశంలో ఆటోను నిలిపాడు. ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులతో పాటు డ్రైవర్... వైద్యురాలితో పాటో ఆమె మిత్రుడిని కొట్టి బెదిరించారు. ఆ తర్వాత ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆమె వద్ద రూ.40వేలతో పాటు బంగారాన్ని సైతం దోచేశారు. కొద్దిరోజుల తర్వాత ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తాగిన మత్తులో అత్యాచారం చేసినట్లు అంగీకరించారు. మిగతా నిందితులను సైతం అరెస్టు చేశారు.

ఎమ్మెల్యేల అనర్హతకు ఎంత సమయం కావాలి?

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ గడువు ముగిసేవరకా అంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెబుతానని న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని గతేడాది మార్చిలో చెప్పినా ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని తెలిపారు.

ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది రోహత్గీ కోర్టుకు తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు ఎమ్మెల్యేలకు స్పీకర్ తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆయన గుర్తుచేశారు. ఎంత సమయం కావాలో స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గీకి ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది.

జయలలిత ఆస్తులన్నీ ప్రభుత్వానికే...

బెంగళూరు : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జె.జయలలిత ఆస్తులన్నీ ఆ రాష్ట్ర ప్రభుత్వానికే చెందుతాయని బెంగుళూరులో ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. ఆస్తికి సంబంధించిన వివాదం చాలాఏళ్లుగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలంటూ బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలిత ఆస్తులను తమిళనాడు ప్రభుత్వం పదేళ్ల క్రితమే స్వాధీనం చేసుకుంది. అయితే అప్పుడు ఆ ఆస్తుల విలువ రూ.913 కోట్లు. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ. నాలుగువేల కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా. అయితే ఆ ఆస్తులు మొత్తం తమకే చెందుతాయంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీపలు అనేక ప్రయత్నాలు చేశారు. ఇటీవల ఆస్తులను తమకే అప్పగించాలంటూ కర్నాటక హైకోర్టును ఆశ్రయించగా... విచారణ చేపట్టిన న్యాయస్థానం వారు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. తాజాగా బెంగళూరులోని ప్రత్యేక కోర్టు తీర్పునిస్తూ జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు ప్రభుత్వానికే చెందుతాయని ప్రకటించింది. ఆమెకు చెందిన 1,562 ఎకరాల భూమి పత్రాలు, 27 కిలోల బంగారు, వజ్రాభరణాలు, పది వేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తువులను కర్నాటక ప్రభుత్వం అప్పగించనుంది.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో సింగరేణి విద్యార్థి సంతోష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఇల్లందు సింగరేణి కాలరీస్ హై స్కూల్ పదవ తరగతి విద్యార్థి సంతోష్ కుమార్ రూపొందించిన స్మార్ట్ రెగ్యులేటర్ ప్రాజెక్టు వైజ్ఞానిక ప్రదర్శనలో జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. మొదటి ఈ ప్రాజెక్ట్ గత నవంబర్ అన్నపురెడ్డిపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి బహుమతి పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైంది. మహబూబ్నగర్‌లో జనవరి 7 నుంచి 9 వరకు జరిగిన రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి పొంది దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. పాండిచ్చేరిలో జనవరి 21 నుంచి 25 వరకు జరిగిన దక్షిణ భారత పోటీల్లో ఇండివిజువల్ క్యాటగిరిలో మొదటి బహుమతి దక్కింది. దీంతో జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు సంతోష్ రూపొందించిన స్మార్ట్ రెగ్యులేటర్ ఎంపికైంది. త్వరలో జాతీయ స్థాయి వైజ్ఞానిక పోటీలు జరగను న్నాయని సింగరేణి విద్యాశాఖ కార్యదర్శి గుండా శ్రీనివాస్ వెల్లడించారు. కాగా ఈ విద్యార్థికి గైడ్ టీచరుగా జీ. ధనలక్ష్మి వ్యవహరించారు. ఈ ప్రాజెక్టు ప్రత్యేకతను వివరించారు. ప్రతి ఇంట్లో నిత్యం వాడే గ్యాస్ సిలిండర్ ప్రమాదాలను ఎలా నివారించాలో ఈ రెగ్యులర్ ప్రాజెక్ట్ ద్వారా సాధ్యమవుతుంది. సిలిండర్ నుండి గ్యాస్ 3 సెకండ్లకు మించి లీకైన వెంటనే స్మార్ట్ రెగ్యులేటర్ దానంతట అదే నాబ్‌ను ఆపి వేస్తుంది. అందులో బిగించే సెన్సార్లు వెంటనే ఇంటి యజమాని ఫోన్‌కు మెసేజ్‌ను కాల్ పంపడమే కాకుండా ప్రత్యేక అలారం కూడా మోగుతుంది. ఇలా గ్యాస్ సిలిండర్ ప్రమాదాలను అరికట్టవచ్చని ఈ ప్రాజెక్టు నిరూపిస్తుంది. సంతోష్ కుమార్ తోపాటు టీచర్ ధనలక్ష్మిని కార్యదర్శి గుండా శ్రీనివాస్ అభినందించారు. ఈ ప్రజెక్టు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

నాయి బ్రాహ్మణులను విస్మరించిన ప్రభుత్వం

విశాలాంధ్ర - గార్ల : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 13 నెలలు దాటినప్పటికి నాయి బ్రాహ్మణ సంక్షేమానికి ఎలాంటి పథకాలు చేపట్టలేదని నాయీ బ్రాహ్మణ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్య క్షులు జంపాల వెంకన్న విమర్శించారు. శుక్రవారం గార్ల మండల కేంద్రం లోని ఆ సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో షాపులు బంద్ పెట్టి నాయి బ్రాహ్మణులు చేసిన పోరాటాలను గుర్తు చేసారు. తెలంగాణ ఏర్పడ్డాక గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ కేసీఆర్ పాలనలో ఎంతో అన్యాయానికి గురైనట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ కష్టాలు తీరుతాయని నాయి బ్రాహ్మణులు మద్దతు తెలిపినట్టు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్ళు దాటిన వారికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మేడేపల్లి దుర్గా ప్రసాద్, జంపాల సతీష్, మేడేపల్లి సైదులు, నిడిగొండ సాంబ, దూదిపాల ఉమేష్, జంపాల కార్తీక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : వచ్చే వేసవిలో ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా ఇప్పటి నుండి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి.రాంబాబు అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక సంఘ కార్యాలయ విభాగాధిపతులతో, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2024-2025 ఆస్తి పన్ను, ఇంటింటి నీటి పన్ను, వాణిజ్య, వ్యాపార పన్ను (ట్రేడ్ లైసెన్స్) 100శాతం వసూళ్లు చేయవలసినదిగా ఆదేశించారు యల్ఆర్ఎస్ స్కీమ్‌కు సంబంధించి మొత్తం ధరఖాస్తులను ఆన్లైన్ పూర్తి చేయవలసినదిగా అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. వార్డులలో ప్రతిరోజూ ఉదయం పారిశుద్యం పనులు చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ కమీషనర్ కే.శ్రీనివాస్ రెడ్డి, యంఎఈ వినోద్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కే.రంగారావు, జేఏఓ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకి అందుబాటులో ఉండాలని మున్సిపాల్టీ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాల్టీ కార్యాలయంలో మున్సిపాల్టీ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పన్నులు పూర్తిగా వసూళ్ళు చేయాలని, యల్ ఆర్ ఎస్ దరఖాస్తులను పరిశీలించాలని, వార్డులలో శానిటేషన్ పనులు ప్రతిరోజు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే వార్డు అధికారుల విధి విధానాల గురించి అదనపు కలెక్టర్ తెలియజేసారు. మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, ఇంచార్జ్ ఏఈ స్వాతి, ఆర్ఐయస్.సైదులు, శానిటరీ సూపర్వైజర్లు షేక్ జానీ, బి.వెంకటేశ్వర్లు, వివిధ విభా గాధిపతులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి-సింగరేణి: శుక్రవారం రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన ఏడుగురు పోలీసు అధికారులను, కుటుంబ సభ్యులను రామగుండం పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితులలో కూడా సంఘ విద్రోహ శక్తులతో పోరాడి కీలకంగా విధులను నిర్వర్తించి, పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండడానికి గల కారణమైన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. సుదీర్ఘకాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు డిసిపి అడ్మిన్ సి.రాజు, ఏసీపీ గోదావరిఖని ఎం.రమేష్, ఏఓ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వామన మూర్తి, సంపత్, ఆర్ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, సరిత, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లా కుంట పోచలింగం, స్వామి, పదవి విరమణ అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : రోడ్డు భద్రత సమాజంలోని అందరి బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపులో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం స్టేడియం నుండి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ వి. పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కోసం ప్రత్యేక ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాలను వెంట తీసుకెళ్లాలని చెప్పారు. ఎంతటి వారైనా నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి వెంకటరమణ, సిక్స్ బెటాలియన్ సీఐ బ్రహ్మం, మోటార్ వెహికల్ అధికారులు మనోహర్, భీమ్ సింగ్, వెంకట పుల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందిస్తేనే పోలీసులకు గుర్తింపు : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీసుశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండి ప్రజలకు సేవలు చేయడం ద్వారానే మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. తమ భాద్యతల్లో నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వహించాలని కోరారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఘనంగా సాయుధ బలగాల డీ-మొబిలైజేషన్ పరేడ్ శుక్రవారం జరిగింది. పోలీస్ హెడ్ క్వార్టర్ హేమచంద్రాపురంలో 15 రోజుల పాటు జిల్లా అర్మడ్ రిజర్వ్ సిబ్బందికి నిర్వహించిన మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా జిల్లా అర్మడ్ సిబ్బంది నుండి ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. 5 ప్లటూన్లతో ఏర్పాటు చేసిన ఈ పరేడ్‌కు అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు ప్లటూన్ కమాండెర్ గా వ్యవహరించారు. ఇందులో ఇండోర్, ఔట్డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్ చేపినట్లు ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ ఎస్పీకి వివరించారు. చాలా ఆకట్టుకునేలా చేసిన పరేడ్ ను చూస్తే తమ శిక్షణ రోజులు గుర్తొస్తున్నాయని ఎస్పీ అన్నారు. అనంతరం అక్కడ పాల్గొన్న అధికారులు, సిబ్బంది సమస్యలను తెలుసుకొని సత్వర పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ డీ-మొబిలైజేషన్ పరేడ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన అధికారులను అభినందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాకు చెందిన 260 మందికి ఎస్పీ మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిఐలు నాగరాజు, శ్రీనివాస్, హెూంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు, ఎంటిఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రత మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయం నుంచి జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవం ముగింపు సందర్భంగా, రహదారి సురక్ష అభియాన్-శ్రద్ధ రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. రహదారి భద్రత మన అందరి బాధ్యత సమాజిక బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు రక్షించాలని అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు జనవరి 1 ప్రారంభించిడం జరిగిందన్నారు. జిల్లాలో రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రచారం సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రతలో ప్రజలు భాగస్వామ్యం అయితే ప్రమాదాలు నివారించ వచ్చని ఆయన తెలిపారు. వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - ఇల్లందు : ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక శ్రీ హరిహర క్షేత్రం ఆలయంలోని వాసవీ మాతకు పంచామృత, ఫలరసాలతో అభిషేకములు, మహిళలచే కుంకుమ పూజ, పుష్పార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల క్రతువులు జరిగాయి. కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. శాంతి, అహింసలకు ప్రతిరూపంగా పార్వతీ దేవి అంశలో జన్మించిన వాసవీ మాత ఆత్మార్పణ చేసుకొని వైశ్య కులదేవతగా అవతరించిందని సభ్యులు అన్నారు. ఈ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం మండల పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, వాసవిక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బోనగిరి రవి కిరణ్, తీర్థాల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి :ఎస్ఐ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : విద్యతో మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపా ధ్యాయ, సిఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు శుక్రవారం ఏటూరు నాగారం మండలంలోని సంద్రగూడెం గుత్తి కోయ గుంపును సందర్శించారు. గుత్తికోయగూడెంలో విద్యాభ్యసిస్తున్న పిల్లలకు నోట్ పుస్తకాలు, పెన్నులు, తిను బండారాలు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనేది ఒక నిచ్చెన లాంటిదని, మనం ఎంత చదివి ముందుకు వెళుతుంటే అంత పైకి మనల్ని తీసుకెళ్తుందన్నారు. నువ్వు చదివే ప్రతి పుస్తకం, నీకు ఏదో ఒకటి నేర్పిస్తూనే ఉంటుందని, దాన్ని నువ్వు గ్రహించినప్పుడే, ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కగలవు అన్నారు. గూడెంలో పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకొని, తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. గూడెంలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే, తమ దృష్టికి తీసుకొనిరావాలని, పోలీస్ శాఖ తరపున సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. గూడెంలో కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్స్ సిఆర్పిఎఫ్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులపై కేసు కొట్టివేత

విశాలాంధ్ర - ఖమ్మం : విధులకు ఆటంకం కలిగించారని 16 మంది సిపిఐ నాయకులపై పెట్టిన కేసును ఖమ్మం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏపూరి బిందుప్రియ శుక్రవారం కొట్టివేశారు. 2014 సంవత్సరంలో మమత సమీపంలోని సాగర్ కాలువ కట్టలపై పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను పోలీసులు అక్రమంగా తొలగిస్తున్న సమయంలో సిపిఐ నాయకులు అడ్డుకున్నారని తమ విధులకు ఆటంకం కలిగించారని అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి విచారణ తర్వాత కేసును కొట్టివేశారు. ఈ కేసులో ఉన్న సిపిఐ సీనియర్ నాయకులు మేకల సంగయ్య, ఎన్.రమాదేవిలు మరణించగా మిగిలిన వారిని నిర్దోషులుగా తేల్చారు. ఈ కేసులో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, జక్కుల లక్ష్మయ్య, ఉపేందర్, ఎల్లయ్య, స్వర్ణ ప్రశాంత్, జి.రవి, ఎ.శివ, సామ్రాజ్యం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. ఓరుగంటి శేషగిరిరావు ముద్దాయిల తరుపున వాదించారు.

సామూహిక కుంకుమ పూజలు

విశాలాంధ్ర - పినపాక : వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మణుగూరు వాసవీ క్లబ్, వాసవీ వనితా వైభవం ఆధ్వర్యంలో శుక్రవారం వాసవీనగర్‌లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గోదావరి నది ఒడ్డున బ్రహ్మకుండ పవిత్ర స్థలంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అగ్ని గుండంలో ప్రవేశించి ఆమె భౌతిక నివాసాన్ని విడిచిందన్నారు. భూమిని విడిచి వెళ్లే ముందు తాను ఆది పరాశక్తి అవతారమని ధర్మాన్ని, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు వాసవీ మాత అమ్మవారి అవతారంలో వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి దోసపాటి లక్ష్మి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు మిట్టపల్లి శ్యామ్, వనితా వైభవం అధ్యక్షురాలు బొగ్గవరపు అంజలి, జోన్ ఛైర్మన్ దోసపాటి స్వర్ణ, ఐపీసీ బండారు నరసింహారావు, జిల్లా క్లబ్ పీఆర్ఓ కడవెండి విశ్వనాథ గుప్తా, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టూరి శేష బాబు, సముద్రాల కృష్ణ మూర్తి, ఇందుమతి, కంకటాల సాయి, జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, ఆర్యవైశ్య నియోజకవర్గ ఇన్చార్జి కత్తి రాము, చిత్తలూరి రమేష్ బాబు, చిట్టూరు మణి, వందనపు వాసు, వడియాల ప్రభాకర్‌రావు, కేస రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు మురహరి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం : సాబీర్ పాష

వనమానగర్‌కు చెందిన 30 కుటుంబాలు సీపీఐలో చేరిక

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో నియోజకవర్గంలోని అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాష అన్నారు. కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో శుక్రవారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతి లోగల వనమానగర్ కు చెందిన 30 కుటుంబాలు సాబీర్ పాష సమక్షంలో సిపిఐలో చేరాయి. వీరికి ఎర్రకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రతి పేదకుటుంబానికి చేరాలన్నదే కంమ్యూనిస్టు పార్టీ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అందించాలని అధికారులను కోరారు. సంస్థకు అవసరం లేని స్థలాలను ప్రభుత్వానికి అప్పగించి పేదలకు న్యాయం చేయాల కోరారు. సిపిఐలో చేరిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు దొమ్మేటి శ్రీనివాస్, తోట నవీన్, బోళ్ల సాయి కుమార్, గుండ్ల రమేష్, తమ్మిశెట్టి సురేష్, వేముల నాగమణి, తోట స్వరూప తదితరులున్నారు. సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వీరా స్వామి, నాగేశ్వర్ రావు, సుధాకర్, మన్నెం వెంకన్న, మల్లేష్, తిరుపతి, మన్నెం భాస్కర్, కట్టా శంకర్, ఉదయ్, భద్రరావులు పాల్గొన్నారు.

122 మంది పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ జిల్లాలో ఆపరేషన్ స్మైల్ -11 నిర్వహించి 122 మంది పిల్లలను తిరిగి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్పి డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో గల బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బడి మానేసిన, వివిధ దుకాణాలు, కర్మాగారాలు, ఇటుక భట్టీలలో పనిచేస్తున్న పిల్లలను గుర్తించి, రెస్క్యూ చేసి వారికి, వారి తల్లితండ్రులకు, యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. సంరక్షణ కేంద్రాల్లో ఉంచి తల్లితండ్రులు వచ్చిన తరవాతే వారిని అప్పగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సియాటెల్ బిజినెస్ ఫోరమ్: భారత్‌లో పెట్టుబడులకు అవకాశాలు

హైదరాబాద్: సియాటెల్లోని భారత కాన్సులేట్ జనరల్ తొలి ఇన్వెస్ట్ ఇండియా బిజినెస్ ఫోరం (ఐఐబిఎఫ్)ను నిర్వహించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అగ్రిటెక్, హెల్త్ కేర్, ఉన్నత విద్య, టూరిజం వంటి రంగాల్లో అమెరికా నుంచి భారత్‌కు పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఫోరం వివరించింది. బెల్ హార్బర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని గ్రేటర్ సియాటెల్ పార్టనర్స్, నార్త్ వెస్ట్ సీపోర్ట్ అలయన్స్ సహకారంతో నిర్వహించారు. గ్రేటర్ సియాటెల్ ప్రాంతం నుంచి భారత్ కు ఎగుమతులకు అవసరమైన వస్తువులను కూడా ఫోరం ప్రదర్శించింది. వివిధ సెషన్లలో, కృత్రిమ మేధ, అగ్రి-టెక్, హెల్త్కేర్, ఉన్నత విద్య, పర్యాటక రంగాలకు చెందిన నిపుణులు ప్రాజెక్టు-నిర్దిష్ట పెట్టుబడి అవకాశాలు, ఈ పరిశ్రమలలో వృద్ధి కన్పించింది. అన్ని భారతీయ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ప్రత్యేక ఉత్పత్తులను ప్రదర్శించిన వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రాడక్ట్ (ఓడీఓపీ) ఎగ్జిబిషన్ను హైలైట్ చేస్తూ కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ఎక్స్'లో ఈ కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను పంచుకుంది.

యమహా మోటార్ సైకిళ్లపై భారీ తగ్గింపు

ముంబయి: ఇండియా యమహా మోటార్ (ఐవైఎం) ప్రైవేట్ లిమిటెడ్, దాని కస్టమర్-కేంద్రీకృత విధానానికి అనుగుణంగా, ప్రీమియం మోటార్‌సైకిళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, దాని ఫ్లాగ్‌షిప్ మోడళ్లు -యమహా ఆర్3 మరియు ఎంటీ-03లపై రూ.1.10 లక్షల వరకు తగ్గింపును ప్రకటించింది. ఇది ఫిబ్రవరి 1, 2025 నుండి అమలులోకి వస్తుంది. ఈ మోడల్‌లు, వాటి అత్యుత్తమ పనితీరు, యమహా సిగ్నేచర్ రేసింగ్ డీఎన్ఏ, ఇప్పుడు సాటిలేని ధరలకు అందుబాటులో ఉన్నాయి. యమహా ప్రపంచవ్యాప్తంగా ఆర్3 వారసత్వానికి పదేళ్లు పూర్తయినందున, ఈ ధరల సవరణ జరిగింది. యమహా ఆర్3 ధర ఇప్పుడు రూ.3,59,900 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ)కు ఐకాన్ బ్లూ, యమహా బ్లాక్ కలర్ ఎంపికల్లో అందుబాటులో ఉంది. అదే సమయంలో, ఎంటీ-03, దాని బోల్డ్ డిజైన్, స్ట్రీట్ పర్ఫార్మెన్స్‌తో, రూ.3,49,900 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) ధరతో, మిడ్‌నైట్ సియాన్, మిడ్‌నైట్ బ్లాక్ కలర్ ఎంపికల్లో అందుబాటులో ఉంది.

ఎంబైబ్‌తో సామ్‌సంగ్ భాగస్వామ్యం

గురుగ్రామ్: భారతదేశ అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ ఏఐ ఆధారిత వ్యక్తిగతీకరించిన అభ్యాస ఫలితాల వేదిక ఎంబైబ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిని టీవీ కోసం రూపొందించిన విద్యా యాప్ సామ్‌సంగ్ ఎడ్యుకేషన్ హబ్ యాప్‌లో అనుసంధానించింది. ఈ భాగస్వామ్యం టీవీలు విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన అభ్యాస అనుభవాలను అందించే ప్రభావవంతమైన విద్యా సాధనాలుగా మారడానికి సహాయపడుతుంది. ఈ భాగస్వామ్యం ద్వారా సామ్‌సంగ్ ఎడ్యుకేషన్ హబ్ యాప్‌లో భాగంగా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్, అన్ని రాష్ట్ర బోర్డులు, ఐఐటీ జేఈఈ, నీట్ వంటి ప్రధాన ప్రవేశ పరీక్షలతో సహా అన్ని ప్రధాన పాఠ్యాంశాలకు మద్దతు ఇస్తూ విస్తృతమైన విద్యా కవరేజీని ఎంబైబ్ అందిస్తుంది. అత్యంత సంక్లిష్టమైన అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా త్రీడీ వీడియోల భారీ కలెక్షన్ నుండి విద్యార్థులు ప్రయోజనం పొందుతారు.

ఒప్పో రెనో13 సిరీస్ 5జీలో ఏఐ ఫీచర్లు

ముంబయి: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెనో13 సిరీస్ 5జీని ఒప్పో ఇండియా అధికారికంగా విడుదల చేసింది. స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని పునర్నిర్వచించేలా దీన్ని తయారు చేశారు. దీనిలోని మీడియాటెక్ డైమెన్సిటీ 8350 ఎస్ఓసీతో శక్తినిచ్చే ఫ్లాగ్‌షిప్-స్థాయి కెమెరా సిస్టమ్‌ను కలిగి ఉంది. ఇమేజింగ్, ప్రొడక్టివిటీ రెండింటినీ అందించేలా అత్యాధునిక ఏఐ ఫీచర్లు కలిగిన, రెనో13 సిరీస్ అసాధారణమైన పనితీరును అందించేలా తయారు చేశారు. నూతన రెనో13 5జీ రెండు వేరియంట్లలో నికర ప్రభావవంతమైన ధరతో లభిస్తుంది. అన్ని ఆఫర్లు 8జీబీ+128జీబీకి రూ.34,199, 8జీబీ+256జీబీ వేరియంట్‌కు రూ.35,999 ధరకు లభిస్తుంది.

సన్ ఫీస్ట్ తాజా బిస్కెట్ బ్రాండ్ 'వాఫ్జర్స్' విడుదల

హైదరాబాద్: బిస్కెట్ల విభాగంలో ప్రసిద్ధి చెందిన ఐటిసి సన్‌ఫీస్ట్, దాని తాజా ఆవిష్కరణ - సన్‌ఫీస్ట్ వాఫ్జర్స్‌ను విడుదల చేసింది. క్రంచీనెస్, ఆహ్లాదకరమైన రుచుల అసమానమైన మిశ్రమంతో క్రాకర్ విభాగాన్ని పునర్నిర్వచించడానికి రూపొందించబడిన సన్‌ఫీస్ట్ వాఫ్జర్స్ స్నాక్ టైమ్‌ను పునర్నిర్వచించడానికి, రుచికరమైన క్రాకర్ విభాగానికి తీపి, ఆహ్లాదకరమైన మలుపును తీసుకురావడానికి సిద్ధమైంది. క్రాకర్లలో వినియోగదారుల ప్రాధాన్యతను నడిపించే కీలక అంశాలలో 'క్రంచీనెస్' ఒకటిగా నిలిచింది. సన్‌ఫీస్ట్ వాఫ్జర్స్ అసాధారణమైన 14-లేయర్ పరిపూర్ణమైన క్రాకర్ డిజైన్‌ను కలిగి ఉంది. ఇది అసాధారణమైన క్రిస్పీనెస్, ఆహ్లాదకరమైన ఆకృతిని అందిస్తుంది. సాంప్రదాయ రుచులకు భిన్నంగా, సన్‌ఫీస్ట్ వాఫ్జర్స్ రెండు రుచికరమైన వేరియంట్‌లను పరిచయం చేసింది. అవి చీజ్ క్రీం ఎన్‌రోబ్డ్ క్రాకర్, లెమన్ క్రీం ఎన్‌రోబ్డ్ క్రాకర్.

గ్రామీణ వైద్యులపై ఐఎంసీ తనిఖీలను ఆపాలి

విశాలాంధ్ర - ఖమ్మం : మారుమూల గ్రామాలలో ప్రాథమిక వైద్యం అందించి జీవిస్తున్న గ్రామీణ వైద్యులపై ఐఎంసి డాక్టర్ల బృందాల తనిఖీలను వెంటనే నిలిపివేయాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 9వ తేదీన గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం 22వ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఖమ్మంలోని ప్రమీల హాస్పిటల్ కాంప్లెక్స్‌లో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌తోపాటు కరపత్రాలను అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమహాసభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రమేష్, గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్‌తోపాటు పలువురు యూనియన్ రాష్ట్ర నేతలు పాల్గొననున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని గ్రామాలలో ప్రాథమిక వైద్యం చేస్తున్న గ్రామీణ వైద్యులపై ఐఎంసి డాక్టర్ల బృందం దాడులు చేసి కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి, జిల్లా ఉపాధ్యక్షులు నారపోగు సుదర్శన్, గరిడేపల్లి వెంకటరామయ్య, శ్రీనివాసరావు,పెద్ద భాస్కర్, ప్రముఖ న్యాయవాది సుగుణ రావు మండలాల అధ్యక్ష కార్యదర్శులు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే ప్రతిభా పరీక్షలు

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రతిభని, సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు, ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పదవ తరగతి జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం, స్వాతంత్ర సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించి, ఎందరినో అత్యున్నత మేధావులుగా తీర్చిదిద్దిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు చేస్తున్న కృషిని అందరు అభినందించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న పదవ తరగతి విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ టేలెంట్ టెస్టులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పేపర్ను రూపొందించామని తెలిపారు. వారి సిలబస్ నుండే 100 మార్కులకు ఆల్ఫాబెట్ రూపంలో అన్ని సబ్జెక్టులు ఈ ప్రశ్న పత్రంలో ఉంటాయని విద్యార్థులకు చాలా ముఖ్యమైనటువంటి ప్రశ్నలను మాత్రమే ఈ పరీక్ష పత్రాల్లో ఇస్తామని విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్. జిల్లా సహాయ కార్యదర్శులు నాగుల మేర. శివ నాయక్ వంశీ హరికృష్ణ గోపి పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆత్మహత్య దిశగా ఎన్నికల కమిషన్

ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత గురించి చర్చించే అవకాశం పోయింది. ఇప్పుడు మాట్లాడవలసింది ఎన్నికల కమిషన్ కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వానికి పల్లకీ మోసే బోయిగా తయారైన వైనం గురించే. గత వారం దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హర్యానా ప్రభుత్వంపై భీకరమైన ఆరోపణ చేశారు. హర్యానా ప్రభుత్వం యమునా నది నీటిలో విషం కలుపుతోందన్నారు. నిజానికి ఆయన ఉద్దేశం యమునా నది నీటిని విషపూరితం చేస్తున్నారని చెప్పడం కావొచ్చు. దాన్ని మాటల తొట్రుపాటుగానే అర్థం చేసుకోవాలి. దీనివల్ల భారీగా జన నష్టం జరిగే ప్రమాదం ఉందని కూడా ఆయన ఆరోపించారు. ఇది రెండు రాష్ట్రాలకు సంబంధించిన వివాదం. రాష్ట్రాల మధ్య నదీ జలాల దగ్గర నుంచి అనేక వివాదాలు ఉండడంలో ఆశ్చర్యం లేదు. హర్యానా ప్రభుత్వం కేజ్రీవాల్ ఆరోపణను తీవ్రంగా ఖండించింది. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ యమునా నది దగ్గరికి వెళ్లి అక్కడి నీటిని తాగి చూపించారు. కేజ్రీవాల్ అబద్ధాలాడుతున్నారని నిందించారు. హర్యానా నుంచి వచ్చే యమునా నది నీటిలో అమోనియా, క్లోరిన్ చాలా ఎక్కువగా ఉన్నాయని కేజ్రీవాల్ చెప్తున్నారు. ఈ ఆరోపణలో ఎంత నిజం ఉందన్నది వేరే ప్రశ్న. కానీ ఇది ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తుందా! ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనా? హర్యానా నుంచి ఫిర్యాదు అందగానే ఎన్నికల కమిషన్ అరవింద్ కేజ్రీవాల్‌కు నోటీసు జారీ చేసి మర్నాడు సాయంత్రానికల్లా సమాధానం చెప్పాలని కోరింది. కేజ్రీవాల్ చేసిన ఆరోపణలకు రుజువులు చూపించాలని అడిగింది. దీనికి సమాధానంగా కేజ్రీవాల్ ఎన్నికల కమిషన్‌కు సుదీర్ఘమైన లేఖ రాశారు. ఈ జవాబుతో తాము సంతృప్తి చెందలేదని ఎన్నికల కమిషన్ అంటోంది. శుక్రవారం ఉదయం 11 గంటలకల్లా మళ్లీ సమాధానం ఇవ్వాలని లేకపోతే చర్య తీసుకుంటామని ఎన్నికల కమిషన్ హెచ్చరించింది. రెండు రాష్ట్రాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు ఎన్నికల కమిషన్ పరిధిలోకి ఎలా, ఎందుకు వస్తాయో తెలియదు. దిల్లీ ఎన్నికలలో న్యూ దిల్లీ నియోజకవర్గం నుంచి తనపై పోటీ చేస్తున్న బీజేపీ నాయకుడు ప్రవేశ్ వర్మ బహిరంగంగా డబ్బులు పంచుతున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. డబ్బులు పంచడానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. ప్రవేశ్ వర్మ చీరలు, జోళ్లు కూడా పంచుతున్నట్టు ఈ వీడియోల్లో కనిపిస్తోంది. ఈ అంశంపై ప్రవేశ్ వర్మ మీద ఎన్నికల కమిషన్ ఏ చర్యా తీసుకోలేదు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల వాదోపవాదాలపై మాత్రం శివాలెత్తినట్టు పని చేస్తోంది. ఇది కచ్చితంగా పక్షపాత ధోరణే. ఓటర్లకు డబ్బు పంచడం కచ్చితంగా ఎన్నికల ప్రవర్తనావళిని ఉల్లంఘించడమేనన్న వాస్తవం కబోది లాంటి ఎన్నికల కమిషన్‌కు కనిపించడం లేదు. మరో వేపు ఎన్నికల సంఘం సిబ్బంది, పోలీసులు దిల్లీలోని పంజాబ్ ముఖ్య మంత్రి బల్వంత్ సింగ్ మాన్ దిల్లీ వచ్చినప్పుడు ఉండే ఇంట్లో సోదాలు చేశారు. ఆ ఇంటి నుంచి డబ్బులు పంచుతున్నట్టు తమకు ఫిర్యాదు వచ్చిందని అక్కడికి వెళ్లిన ఎన్నికల సంఘం అధికారి ఒకరు చెప్పారు. ప్రవేశ్ వర్మ డబ్బులు పంచడానికి సంబంధించిన వీడియోలు ప్రచారంలో ఉన్నా వాటిని పట్టించుకోని ఎన్నికల సంఘం బల్వంత్ సింగ్ మాన్ విడిదిని సోదా చేయడం విచిత్రంగా ఉంది. ఎన్నికల సంఘం ఎంత మాత్రం తటస్థంగా లేదని అర్థం అవుతోంది. ముఖ్యంగా రాజీవ్ కుమార్ ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి అయినప్పటి నుంచి తటస్థత ఎన్నికల కమిషన్ పరిసరాల నుంచి పలాయనం చిత్తగించినట్టుంది. రాజీవ్ కుమార్ అధికార పక్షం పల్లకి బోయిగా మారినట్టున్నారు.

ఎన్నికల కమిషన్ కేజ్రీవాల్‌ను ప్రశ్నించడం, దానికి ఆయన సమాధానం ఇవ్వడం, అది కమిషన్‌కు నచ్చకపోవడం మరో ఉత్తరం రాయడం దానికి మళ్లీ కేజ్రీవాల్ సమాధానం రాయడం – ఇలా శరవేగంతో ఉత్తరప్రత్యుత్తరాలు నడవడం ఇంతకు ముందెన్నడూ లేదు. కేజ్రీవాల్ విషయంలోనే ఎన్నికల కమిషన్ ఎక్కడ లేని ఆత్రుత ప్రదర్శిస్తోంది. అధికార పార్టీ నడవడికపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేస్తే ఎన్నికల కమిషన్ చాలా సందర్భాలలో ఎన్నికలు ముగిసిన తరవాత గానీ నిర్ణయం ప్రకటించదు. కేజ్రీవాల్‌పై సి–విజిల్ ద్వారా ఫిర్యాదు అందిందట. అందుకే కపుర్తలా హౌజ్ లో సోదాలు చేశారట. ఎన్నికల కమిషన్ ప్రవర్తన రాను రాను వింతగా మారుతోంది. ఉదాహరణకు ఇటీవలే శాసనసభ ఎన్నికలు జరిగిన హర్యానా, మహారాష్ట్రలో ప్రతి పక్షాలు ఎన్ని ఫిర్యాదులు చేసినా వాటిని ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదు. కేజ్రీవాల్ విషయంలో మాత్రం ఎక్కడ లేని తొందరపాటు కనిపిస్తోంది. దిల్లీ ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. బీజేపీ ఎంపీల ఇంటి చిరునామాలో 15–20 మంది ఓటర్లు ఉన్నారని, కొందరి ఓటర్ల పేరు ఏకపక్షంగా తొలగించారని, మరి కొందరి పేర్లు అంతే ఏకపక్షంగా చేర్చారని, అవి వేల సంఖ్యలో ఉన్నాయని ఎన్ని ఫిర్యాదులు వచ్చినా రాజీవ్ కుమార్ నాయకత్వంలోని కమిషన్‌కు చీమ కుట్టినట్టయినా లేదు. యమునా నది జలాలు విషపూరితమైనాయని కేజ్రీవాల్ ఆరోపించడం రెండు వర్గాల మధ్య తంపులు పెట్టేలా ఉందని ఎన్నికల కమిషన్ వాదిస్తోంది. ఇందులో రెండు వర్గాల ప్రస్తావన ఎక్కడిదో అంతుపట్టదు. పార్లమెంటు ఎన్నికల సమయంలో "ఇండియా" ఐక్య సంఘటన కనక అధికారంలోకి వస్తే అయోధ్యలో రామ మందిరాన్ని కూల్చేస్తారని, ప్రతిపక్షాల వారు దేశంలో చొరబడ్డ వారని మోదీ ఎంతటి తీవ్రమైన ఆరోపణలు చేసినా ఎన్నికల కమిషన్ చెవిన అవి పడనే లేదు. ప్రతి పక్షాలు ఆ విషయమై ఫిర్యాదు చేస్తే పట్టించుకోనూ లేదు. ఎన్నికల సంఘం వ్యవహారం బీజేపీకి సంబంధించినంత మేరకు గాంధీజీ మూడు కోతుల కథలా తయారైంది. ఎన్నికల సంఘం రాజ్యాంగ వ్యవస్థ. కానీ తన పరిధిని ఉల్లంఘించి అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. ఒక వేళ అరవింద్ కేజ్రీవాల్ యమునా జలాలపై చేసిన ఆరోపణకు సంబంధించి ఆయన మీద చర్య తీసుకోవాలనుకుంటే ఆ విషయాన్ని ఓ దర్యాప్తు సంస్థకు నివేదించేది. ఆ దర్యాప్తు సంస్థ నివేదిక ఆధారంగా చర్య తీసుకుని ఉండొచ్చు. ఉన్న అవకాశాన్ని వినియోగించుకోనూ లేదు. ఒక వేళ కేజ్రీవాల్ మాటలు అసత్యాలని తేలితే ఆయన విజయం సాధించినా చర్య తీసుకోవచ్చు. కానీ రాజీవ్ కుమార్ లక్ష్యం అది కాదు. కేజ్రీవాల్ వ్యక్తిత్వం మీద బురద చల్లడంలో ఆయన బీజేపీ నాయకులను మించిపోతున్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగస్వామి అయినట్టు వ్యవహరిస్తోంది. రాజీవ్ కుమార్ ఎన్నికల కమిషన్‌కు ఉన్న విశిష్ట చరిత్ర ఏమిటో గ్రహించడం లేదు. ఎన్నికల కమిషన్ ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

పెద్దలకో... బాలశిక్ష

ప్రియుడుండాలి... ప్రియురాలుండాలి. భర్త ఉండాలి. అతనికి భార్య ఉండాలి. వాళ్లిద్దరికి పిల్లలుండాలి. ఆ పిల్లలు లేకపోయినా ఒకరికి మరొకరు పిల్లలుగా భావించాలి. అలాగే చిరకాలం బతకాలి. జీవితం కదా... ఓ ఇల్లు, బ్యాంకు బ్యాలెన్సు ఉండచ్చు కాని అవే ఉండకూడదు. కాసింత సాహిత్యం... కొన్ని కళలు... ఇంకొన్ని మమకారాలు.... మరి కొన్ని ఆప్యాయతలు... చాలా అనుబంధాలు... తక్కువలో తక్కువ శత్రువులు ఉండాలి. జీవితం ముళ్ల గులాబీలానే ఉండాలి. ఒక్కోసారి ముల్లు గుచ్చుకుని లోకం నొప్పి మనకి ఎరుకలోకి రావాలి. పక్క మీద వాడిపోయే మల్లెపువ్వులా కాకుండా నవ్వులా వికసించే నందివర్ధనంలా ఉండాలి జీవిక. ఆదర్శాలు, త్యాగాలు చేసేందుకు సిద్ధపడాలి కానీ ఆ మాటల్ని వల్లె వేసేందుకే అవి ఉండకూడదు. ప్రజాస్వామ్యం కదా ప్రతిపక్షాల మీద గౌరవం ఉండాలి. పాలక పక్షం చేసే తప్పులపై నిలదీయాలి. సిద్ధాంతాల పట్ల వ్యతిరేకత ఉండాలి. కాని వ్యక్తుల పట్ల అమర్యాద కూడదు.

చిన్నప్పుడు ఓ పుల్లతో సైకిల్ చక్రాన్ని తోసుకుంటూ లోకాన్ని మరచి ఆడుకున్నాం చూడు. యవ్వనంలో కూడా అలాగే ఉండాలి. వృద్ధాప్యంలో ఆ జ్ఞాపకాలు పంచుకునేందుకు ఆనాటి స్నేహితులుండాలి. కుంటాటాడుతూ కాలు తగిలి పడిపోయి నప్పుడు మోకాలు కొట్టుకుపోయి తగిలిన గాయం గుర్తులు అక్కడే

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

ఉండాలి. పోలియో రాకుండా ఆ చాలా చిన్నప్పుడు రెండు భుజాల మీద వేసిన అర్థ రూపాయంత టీకా మచ్చలుండాలి. వాటిని చుక్కల మందు వేసుకోమని మారాం చేస్తున్న పిల్లలకి చూపించి అప్పట్లో "అ టీకాలు వేసుకుంటే ఎంత నొప్పో తెలుసా... పైగా జ్వరం కూడా వచ్చేది" అంటూ నచ్చ చెప్పాలి.

అక్కో, చెల్లో ఆ బాల్యంలో ఆడిన చింతపిక్కలాట గురించి ఆ సోదరి వింటూండగా మేనల్లుడికో, మేనకోడలికో చెబుతూ వారి కళ్లలో ఆనందాన్ని మనం అనుభవించాలి. అక్క పెళ్లి నాటికి వీడియోలు లేవు కదా... అందుకని పెళ్లి చూపులకు బావ గారు బంధువులతో వచ్చినప్పటి నుంచి అక్కని అప్పగించే వరకూ జరిగిన తతంగాన్ని కూడా అక్క పిల్లలకు మనసారా చెప్పాలి. అన్నట్లు ఆ సమయంలో బావ గారు అక్కడే ఉండాలి. ఆనాటి పెళ్లిలో బావగారి స్నేహితులు చేసిన అల్లరి, దానికి మీరు పడిన హైరానా కూడా కాసింత వివరంగానే చెప్పాలి. ఎందుకంటారా... మేనకోడలి పెళ్లి జరుగుతుంది కదా... మేనల్లుడు వాటన్నింటకి సిద్ధం కావాలి కదా... అందుకన్న మాట. షామియానాల కింద పెళ్లిళ్లు బాగుంటాయేమో కానీ తాటాకో, కొబ్బరి ఆకులతో వేసిన పందిళ్ల కింద పెళ్లి ఎంత బాగుంటుందో ఈ తరానికి పందిరంత అందంగా చెప్పాలి. క్యాటరింగ్ భోజనాలు బాగుంటాయి కాని... ఇంట్లోనే వండించుకుంటే ఆ పనిలో కొందరు చేసే హడావుడి ఎంత బాగుంటుందో చెప్పాలి. జైల్లో ఖైదీల్లా లైనులో నిలబడడం, చేతిలో ప్లేటుతో అడుగులో అడుగు వేసుకుంటూ ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ నడిచి వెళ్లి చేసే విందు భోజనం స్టైల్‌గా ఉంటుందేమో కానీ అందంగా, ఆనందంగా ఉండదని ఈ పిల్లలకి చెప్పాలి. నేల మీదో, టేబుల్ దగ్గర కుర్చీలోనో కూర్చున్న అతిథులకి కొసరి కొసరి వడ్డించడంలో ఉన్న ఆనందాన్ని ఈ తరానికి అనుభవంలోకి తీసుకురావాలి.

కొత్త తరానికి దు:ఖ పడడం నేర్పాలి. ముఖ్యంగా ఎదుటి వారి కోసం దు:ఖించడంలో ఉండే ఓ ప్రేమని రుచి చూపించాలి. ఎదుగుదల సరే, బతుకడం ఎలాగో చూపించాలి. సెల్‌ఫోన్ రాకముందటి జీవితాలు ఎలా ఉండేవో కథలు కథలుగా వివరించాలి. ఒంటరిగా తిరగడం బాగుంటుందేమో కానీ సామూహికంగా గడపడంలో ఉన్న బహుముఖాలను పరిచయం చేయాలి. ఆన్‌లైన్ షాపింగ్ తెలుసు కదా ఈ తరానికి.. కానీ కొంత డబ్బు చేతిలో పెట్టి తనకు అవసరమైనవే కొనుక్కుని మిగిలిన డబ్బులు దాచుకోమని ఇవ్వాలి. మార్కెట్‌కి పంపించి వంకాయలు, మామిడి కాయలు, పులుసు కోసం తోటకూర వంటివి తీసుకురమ్మని చెప్పాలి. దూరం నుంచి చూస్తూ బేరాలు అడుతున్నారా...! లేక దుకాణదారు చెప్పిన ధరకే కొంటున్నారో గమనించాలి. ఇంటికి వచ్చాక ఆ పిల్లలు తెచ్చిన కూరగాయల్లో ఎన్ని పుచ్చులున్నాయో... మామిడికాయ పప్పులోకి ఎందుకు పనికి రాదో, తోటకూర ఎలా వడిలిపోయింది కాసింత వివరంగా చెప్పాలి. అమ్మ చేసిన వంటకాలకి పేర్లు పెట్టకుండా వాళ్లనే వండమనాలి. ఆరు నెలలకు ఓసారి పల్లెలకి తీసుకువెళ్లి పంటపొలాలు, వాటిల్లో రెక్కలు ముక్కలు చేసుకుని పొలం పనులు చేస్తున్న కూలీలను పరిచయం చేయాలి. వీలైతే వాళ్లతో కలిసి వాళ్లు తెచ్చిందే తినమని పక్కనే కూర్చుని చెప్పాలి. మీరు కూడా ఆ భోజనమే తినాలి. అన్నం విలువ తెలియాలి కదా... రైతు కష్టం తెలియాలి కదా.

పుట్టుకే కాదు మరణాన్ని కూడా అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఈ లోకంలో ఎవ్వరూ శాశ్వతం కాదని, వారు చేసిన పనులే మిగులుతాయని చివరాఖరున తెలుసుకుంటే ఎలాంటి ఉపయోగం ఉండదని ఎరుక కలగాలి. జీవించడం కోసం కదా వచ్చాం. హాయిగా జీవించి... శ్రమించి... సుఖించి... ప్రేమించి.. .లాలించి.. మోహించి... వ్యాపించి... అలా నడిచి వచ్చిన దారిలోకి అడుగులు వేసుకుంటూ "అతడు లేదా ఆమె ఇంకొన్నాళ్లు ఉంటే బాగుండును" అనిపించుకుని అలా వాయిలీనం అయిపోవాలి.

సీనియర్ జర్నలిస్టు
సెల్: 99120 19929

కార్పొరేట్ల సేవకే అభివృద్ధి మంత్రం

చలసాని వెంకటరామారావు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం సముద్ర తీరంలోని గంగవరం పోర్టు వరకు 464 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారిని కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఈ రహదారి దండకారణ్యం లోని 9 రాష్ట్రాలకు చెందిన 22 జిల్లాలకు అందుబాటులో ఉంటుంది. ఇది ఆరు లైన్ల విశాలమైన రహదారి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విస్తారమైన అటవీ ప్రాంతమే దండకారణ్యంగా ప్రసిద్ధి. ఇది భారతదేశంలో వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్న అరణ్యం. ఇది ఒకప్పుడు కాకులు దూరని కారడివి, చీమలు దూరని చిట్టడివిగా ఉండేది. దండుని పురం మట్టిలో కలిసిపోయి అక్కడ ఏర్పడిన అరణ్యం కాబట్టి దండకారణ్యం అనే పేరు వచ్చింది. ఈ అడవి 200 మైళ్లు అంటే 300 కి.మీ. ఉత్తర దక్షిణాలుగా, మూడు వందల మైళ్లు అంటే 500 కి.మీ తూర్పు, పడమర దిశలకు విస్తరించి ఉంది. దీని చుట్టుకొలత 92,200 చదరపు కిలోమీటర్లు ఉంటుంది. ఈ అడవి తల్లి అపారమైన ప్రకృతి సంపదను తన ఎదలో దాచుకుని ఉంది. ఒక్క వృక్ష సంపదే లక్షల కోట్ల విలువ చేస్తుంది. ఇక్కడే దేశంలోని ప్రధానమైన జీవ నదులు పుడుతున్నాయి. అపారమైన జలరాశి భూమిని పునీతం చేస్తూ సాగర గర్భంలోకి ప్రవహిస్తున్నది. ఈ దండకార ణ్యంలో 26 రకాల విలువైన ఖనిజ సంపదలు ఉన్నాయి. బంగారం, ఇనుము, బొగ్గు, బాక్సైట్, డోలమైట్, క్రోమైట్, మెగ్నీషియం, అల్యూమినియం, ప్లాటినం రాయి, సున్నపు రాళ్లు, సిలికాన్, గ్రానైట్, లిథియం, మాంగనీసు, రాగి, సీసం వంటి విలువైన సంపదకు ఈ అడవులు నిలయం. ప్రపంచ వ్యాపితంగా డిమాండ్ ఉన్న కొకైన్ మత్తు పదార్థానికి కూడా ఈ అడవే ఆధారంగా ఉంది. రాయ్‌పూర్ నుంచి విశాఖలోని గంగవరం వరకు నిర్మిస్తున్న ఈ రహదారి అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. "భారత్ మాలా పరియోజనా" కింద నిర్మిస్తున్న ఈ రహదారి వలన విశాఖపట్నం– రాయ్‌పూర్ మధ్య దూరం 595 కి.మీ నుంచి 464 కిలోమీటర్లకు కుదించటమైంది. ప్రయాణ సమయం 13 గంటల నుంచి 6,7 గంటలకు తగ్గుతుంది. ఇది తూర్పు తీరం ఆర్థిక కారిడార్‌కు దగ్గర రహదారిగా ఉంటుంది. ఈ రహదారి నిర్మాణం వెనుక ఉన్న దేవర రహస్యం తెలిస్తే ఒకింత ఆశ్చర్యం కలుగక మానదు. ఒక్క ఛత్తీస్‌గడ్‌లోనే 31 శాతం ఖనిజ సంపదలు, అటవీ సంపదలు ప్రభుత్వాలకు లక్షల కోట్ల ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. ఈ సంపదలను రాజకీయ నాయకులు, అధికారులు, కార్పొరేట్ కంపెనీలు, సామ్రాజ్యవాద శక్తులు నిలువు దోపిడీ చేసి దోచుకుంటున్నాయి. కోటాను కోట్ల రూపాయల విలువ చేసే దండకారణ్యంలోని ఖనిజ సంపదను ప్రధాని నరేంద్రమోదీ అనుంగు మిత్రులు అదాని, అంబానీ వంటి పారిశ్రామిక దిగ్గజాలకు అప్పనంగా దోచిపెట్టి, విదేశాలకు తరలించటం ద్వారా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించే కుట్రలో భాగంగా జరుగుతున్న తంతు ఇది. దండకారణ్యానికి అతి సమీపంలో ఉన్న పోర్టు విశాఖపట్నంలోని గంగవరం పోర్టు. మిగిలిన పోర్టులన్నీ 900 కి.మీ పైగా దూరంలో ఉంటే గంగవరం మాత్రమే చాలా తక్కువ దూరంలో ఉంది. దీనికి తోడు గంగవరంలో సముద్రంలోతు ఎక్కువగా ఉండి విదేశీ భారీ నౌకల సంచారానికి చాలా అనువైనదిగా ఉంది. ఈ అటవీ ప్రాంతాలలోని రాష్ట్రాలలో అత్యధిక భాగం ఇప్పుడు డబల్ ఇంజిన్ సర్కారు అధీనంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలోని బొగ్గు గనులను అదానీ సొంతం చేశారు. ఎన్.ఎమ్.డి.సి.బైలదిల్లా కంపెనీని ప్రైవేటుకు అప్పగించే పనిలో కేంద్రప్రభుత్వం ఉంది. కొన్ని కంపెనీలను టాటాలకు కట్టబెట్టనున్నారు. లక్షల కోట్ల ఒప్పందాలకు ప్రభుత్వం సిద్ధమౌతున్నది. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దండకారణ్య ప్రాంతాన్ని సైనికీకరణ–ప్రైవేటీకరణకు కేంద్రం కృషి చేస్తున్నది. అందుకు ముందుగా స్థానిక గిరిజన ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ప్రజలపై తరచు యుద్ధం ప్రకటిస్తున్నది. అటవీ ప్రాంతమంతట పోలీసు క్యాంపులు పెట్టారు. గ్రామ సభలను నిర్వీర్యం చేశారు. ప్రజలపై బూటకపు కేసులు పెడుతున్నారు. నక్సలైట్లుగా ముద్రవేసి జైళ్లపాలు చేస్తున్నారు. చిత్రహింసలు పెడుతున్నారు. ప్రజలను వేధింపులకు గురిచేసి వారి పోరాట శక్తిని నిర్వీర్యం చేస్తున్నారు. తద్వారా కార్పొరేట్ శక్తులు అటవీ సంపదను తరలించుకుపోవటానికి మార్గం సుగమం చేస్తున్నారు. దండకారణ్యం ప్రాంతం దేశంలో నక్సలైట్ ఉద్యమానికి కేంద్ర స్థానంలో ఉంది. వీరికి ఇక్కడ గిరిజనులలో మంచి ఆదరణ, ప్రోత్సాహం ఉంది. దీనివలన అటవీ ప్రాంతం నుంచి ప్రకృతి సంపద తరలించాలంటే, గనులను కొల్లగొట్టాలంటే, వృక్ష సంపదను అనుభవించా లంటే కార్పొరేట్ వర్గాలకు స్థానికుల నుంచి తీవ్ర ప్రతిఘట నను ఎదుర్కోవలసి వస్తున్నది. అందుకే నక్సలైట్లను నిర్మూలించటం ద్వారా గిరిజన ప్రతిఘటనో ద్యమాన్ని బలహీనపర్చాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. అందుకే దేశ

దండకారణ్యంలోని ఖనిజ సంపదను ప్రధాని నరేంద్రమోదీ అనుంగు మిత్రులు అదాని, అంబానీ వంటి పారిశ్రామిక దిగ్గజాలకు అప్పనంగా దోచిపెట్టి, విదేశాలకు తరలించటం ద్వారా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించే కుట్రలో భాగంగా జరుగుతున్న తంతు ఇది. దండకారణ్యానికి అతి సమీపంలో ఉన్న పోర్టు విశాఖపట్నంలోని గంగవరం పోర్టు.

హోంశాఖామంత్రి అమిత్‌షా 2026 నాటికి దేశంలో మావోయిస్ట్ ఉద్యమాన్ని నిర్మూలిస్తామని పదేపదే ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో దండకారణ్య ప్రాంతంలో వేలాది మంది సైనికులను, డీఆర్జీ దళాలను, కోబ్రా దళాలను వినియోగించి నక్సలైట్ ఉద్యమకారులను గాలించి, వెంటాడి అంతం చేయాలని ప్రయత్నిస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి ఎదురు కాల్పులు పేరుతో వందలాది మంది అమాయకులను అంతం చేస్తున్నారు. రాకెట్ లాంచర్లతో గ్రామాలపై దాడులు చేస్తున్నారు. గ్రామాలు, అడవులు లక్ష్యంగా ఈ దాడులు నిర్వహిస్తున్నారు. మహిళలపై తరచూ అత్యాచారాలకు పూనుకుంటున్నారు. మీడియాను నియంత్రించటం ద్వారా వాస్తవ విషయాలను బయటకు రాకుండా నియంత్రిస్తున్నారు. వేలాది మంది పోలీసు బలగాలు సంరక్షణలో రోడ్డు నిర్మాణం కొనసాగిస్తున్నారు. సుక్మా– బీజాపూర్ జిల్లాలలో డ్రోన్ల ద్వారా, హెలికాప్టర్ల ద్వారా బాంబులు వేస్తూ ప్రజలను భయకంపితులను చేస్తున్నారు. పేరుకు మావోయిస్టులపై దాడి అని చెబుతూ అమాయక ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. అడవుల్లో వేలాది సైనిక బలగాలతో జల్లెడ పడుతూ ఇటీవల బీజాపూర్ జిల్లా అడవులలో, గదియాబండ్, మారేడుబాక, దక్షిణ అబూజ్‌మడ్ అడవులలో మావోయిస్టు ప్రముఖ నాయకుడు చలపతితో సహా అనేకమంది ముఖ్య నాయకులను మట్టుబెట్టారు. దంతేవాడ, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్, కొండగాం ప్రాంతాలలో తరచుగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నారు. జనవరి 7 న బీజాపూర్ జిల్లాలో అర్ధరాత్రి ప్రజలందరు నిద్రించే సమయంలో టేకుల గూడెం క్యాంపు నుంచి రాకెట్ లాంచర్లతో చుట్టుపట్ల గ్రామాలపై దాడులు చేశారు. ఇక్కడ లంబాడీ, కోయ, గోండు, చెంచు, శంతల, సౌర, భూ మిహార్, కొండరెడ్లు వంటి 32 జాతులకు చెందిన గిరిజన ప్రజలు నివసిస్తున్నారు. వారి శ్రామిక జీవనానికి విఘాతం కల్పిస్తున్నారు. వారి జీవనాధారమైన అడవి నుంచి తరిమివేసే కుట్రలకు పాల్పడుతున్నారు. నదులు, జల పాతాల, సారవంతమైన ప్రదేశాలతో అపార సంపదకు నిలయమైన ఈ ప్రాంతం నుంచి గిరిజనులను గెంటివేసి ఈ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగమే మావోయిస్టుల నిర్మూలన ఆలోచన. గత ఏడాది 42 ఎన్‌కౌంటర్లలో సుమారు 300 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందినట్లుగా లెక్కల చెబుతున్నాయి. దండకారణ్యం ప్రాంతంలో నిత్యం తుపాకుల నీడన పాలన సాగుతున్నది. అపార ఖనిజ సంపద ఉన్నా ప్రజలు కడు పేదరికం అనుభవిస్తున్నారు. ఈ ఖనిజ సంపదను కార్పొరేట్ లాబీ జపాన్, చైనా వంటి అనేక దేశాలకు ఎగుమతులు చేసి తమ సంపదను పెంచుకుంటున్నది. ప్రపంచ కోటీశ్వరులతో లాభాలలో పోటీ పడుతున్నది. మన ముడి సరుకుని వినియోగించుకుని ఆయా దేశాలు అభివృద్ధిలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలుగా మనపై పెత్తనం చేస్తున్నాయి. భారత్ ముడి సరుకు వినియోగించు కుంటున్న అభివృద్ధి చెందిన దేశాలు తాము నెలకొల్పిన ఆధునిక, పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పి 7, 8 దశాబ్దాలు గడిచిపోయింది. నేటి పరిస్థితులకు అనుగుణంగా వాటిని ఆధునీకీకరించాల్సి ఉంది. అందుకు అవసరమైన ఖనిజ, వృక్ష సంపదను దండకారణ్యం నుంచి తరలించటానికి రాయపూర్– విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రహదారి, గంగవరం పోర్టు దోహదం చేస్తాయి. ఆయా దేశాలు ఆధునీకీకరణలో తొలగించిన వృథా యంత్రాలను కరిగించి భారతదేశంలో మార్కెట్ చేసుకునేందుకు కూడా ఈ పోర్టు, రహదారి ఉపయోగపడతాయి. దేశ పారిశ్రామిక దిగ్గజాలకు, దోపిడీదారులకు, బహుళజాతి కంపెనీలకు ప్రయోజనాలు కల్పించే కుట్రలకు కేంద్రంగా గంగవరం పోర్టు అదాని చేతుల్లో ఉంది. ఇక దండకారణ్యం పైనా తమ ఆధిపత్యం నెలకొల్పుకుంటే వారి ఆర్థిక సామ్రాజ్య విస్తరణకు అడ్డే ఉండదు. ఈ కుట్రలకు చేయూతనిచ్చే క్రమంలోనే రాయపూర్– గంగవరం రహదారి నిర్మాణం జరుగుతున్నది. అభివృద్ధి మంత్రం జపిస్తూ కార్పొరేట్ల భజనతో అపారమైన ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే చర్యలను ప్రజలు గ్రహించి పాలకుల అసంబద్ధ, ప్రజా వ్యతిరేక విధానాలను అడుగడుగునా ప్రతిఘటించాలి. ప్రకృతి ప్రసాదించిన విలువైన సంపదను భవిష్యత్ తరాల కోసం కాపాడాలి.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093

సాయుధ పోరాట సేనానులు - 4

ఆర్వీ రామారావ్

"ఆయన రోడ్డుపై నడుస్తుంటే హైదరాబాద్ చరిత్ర నడిచినట్టుంది" అని డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్ గురించి ప్రముఖ కవి జ్వాలాముఖి అనేవారు. డా. గౌర్‌ది బహుముఖీనమైన వ్యక్తిత్వం. చదివింది వైద్య శాస్త్రం. అదీ ఉర్దూ మాధ్యమంలో. కానీ విద్యార్థి దశలోనే విప్లవ కార్యాచరణ ఆయన ప్రవృత్తిగా మారినందువల్ల వైద్య వృత్తి చేపట్టకూడదనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆదేశం ప్రకారం కార్మికోద్యమంలోకి దూకారు. హైదరాబాద్ పాత బస్తీలో జన్మించిన రాజ్ బహదూర్ హైదరాబాద్ మిశ్రమ సంస్కృతిక ప్రతీక. మాతృ భాష ఉర్దూ అయినప్పటికీ తెలుగువారి సాంస్కృతిక జీవనం బాగా తెలిసినవాడైనందు వల్ల ఆయన మాటల్లో ఈ రెండు భాషలు మాట్లాడే వారి సాంస్కృతిక విశేషాలు బయటపడ్తుండేవి. యాదృచ్ఛికమే కావచ్చు కాని ఆయన తండ్రి పేరు ముస్లిం–హిందూ పేర్ల సమాహారమైన రాయ్ మహబూబ్ రాం గౌర్. ఆయన బాబాయి పేరు రాయ్ మహబూబ్ నారాయణ్. రాజ్ బహదూర్ తో మాట్లాడితే ప్రపంచమంతా చుట్టివచ్చినట్టు ఉండేది. జీవితానుభవం ఆవిష్కరిస్తున్నట్టు ఉండేది. ఆయన ఆలోచనా ప్రవంతి ఎదుటివారికి ఆవేశం కలిగించేది. మధ్యమధ్యలో చమత్కారం ఆయన సంభాషణా శైలి అయినప్పటికీ ఒక విషయాన్ని వివరిస్తున్నప్పుడు, సామాజికాంశాలను తడుముతున్నప్పుడు ఆయన విరాడ్రూపం సాక్షాత్కరించేది. డా. రాజ్ సమయస్ఫూర్తి అనితర సాధ్యమైంది. చమత్కారాన్ని, ఛలోక్తులను సందర్భానుసారంగా జత చేస్తారు. వాటికి వాతావరణంలో వేడి తగ్గించే శక్తి ఉంది. తన మీద తాను వ్యంగ్యోక్తులు విసురుకోగల విశాల మనస్తత్వం ఆయనది. 75 ఏళ్లు వచ్చిన తరవాత అన్ని పదవులూ వదులుకున్నారు. బతికినన్నాళ్లు ఏదో ఓ పదవిని పట్టుకుని వేలాడడం ఆయన స్వభావం కాదు. "నేనిప్పుడు పార్టీకి నిరర్థక ఆస్తిని" అని అన్నప్పుడు త్రికాలాలను ఒక్క మాటలో ఎలా చెప్పగలరోనని ఆశ్చర్యపడక తప్పదు. కమ్యూనిస్టుగా, కార్మిక నాయకుడిగా, పార్లమెంటే రియన్‌గా, పండితుడిగా విపరీతంగా రాసిన రచయితగా ఎన్ని అవతారా లెత్తినా భాషాపరమైన మైనారిటీలకు అన్యాయం జరిగిందనుకున్నప్పుడు ఆయన గళం ఎత్తేవారు. ఉర్దూకు సముచిత స్థానం కోసం ఆయన తుదివరకు పోరాడారు. నిజాం హయాంలో తెలుగుకు దక్కాల్సిన స్థానం కోసం, స్వాతంత్ర్యం తరవాత ఉర్దూకు సరైన అవకాశం కోసం పోరాడారు. ఆయన మరణించడానికి 20 రోజుల ముందు పార్లమెంటు సభ్యుడిగా తనకు పింఛన్ బకాయిలు మూడు లక్షల రూపాయలలో కొంత ఉర్దూ తాలిమీ ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చారు. మరికొంత ఎ.ఐ.టి.యు.సి. రాష్ట్ర శాఖకు ఇచ్చేశారు. తాను మరణించిన తరవాత తన భౌతిక కాయాన్ని తాను వైద్య విద్య అభ్యసించిన ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థుల పరిశోధనకోసం అందజేయాలని వీలునామా రాశారు. తన బ్యాంకు ఖాతాలో డబ్బేదైనా మిగిలితే పార్టీ ఖాతాకు జమ చేసుకోవాల్సిందిగా కోరారు. అభిరుచి, అభిమానం కొద్దీ ఆయన చేసిన రచనలు ఒక ఎత్తయితే అవసరార్థం రాసిన రచనలూ ఉన్నాయి. సీపీఐ హైదరాబాద్ శాఖకు డబ్బు ఇబ్బంది వస్తే ఆఫీస్ సెక్రెటరీ యూసఫ్ వెళ్లి రాజ్ చేత ఏదో ఒక వ్యాసం రాయించి ప్రచురించి ఆ డబ్బు పార్టీకోసం వెచ్చించేవారు. రాజకీయ కార్యకలాపాల మధ్య విశ్రాంతి కోసం రాజ్ కొనసాగించిన నిరంతర సాహిత్యాధ్యయనం ప్రేం చంద్, శరత్, కందుకూరి వీరేశలింగం, మౌలానా హస్రత్ మోహానీ, కిషన్ చందర్, ముల్క్ రాజ్ ఆనంద్, కె.ఎ.అబ్బాస్ వంటి వారి సాహిత్యాన్ని వెలకట్టడానికి ఉపకరించింది. పోరాట కవిత్వం కేవలం

రాజ్ బహదూర్ గౌర్

ప్రేరణ మాత్రమే కలిగించదు, అలసటనూ తీరుస్తుందన్న ఆయన భావన ఆయనను సాహితీ విమర్శ రంగంలో సూత్రకారుడి స్థాయికి తీసుకెళ్లింది. తెలంగాణా సాయుధ పోరాట సమయంలో రాజ్ బహదూర్ గౌర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. అప్పటి రాజ్యసభ అధ్యక్షులు, ఉపరాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చొరవతో విడుదలయ్యారు. ఆయన రాజ్యసభలో ప్రవేశించగానే అప్పటి కేంద్ర మంత్రి గోపాలస్వామి అయ్యంగార్ ఆయనను ఆయుధాలతో సహా అడవిలో అరెస్టు చేశారని గుర్తు చేశారు. అప్పుడు వెంటనే రాధాకృష్ణన్ "ప్రతి రుషికి ఓ గతం ఉంటుంది, ప్రతి పాపికీ ఓ భవిష్యత్తు ఉంటుంది" అని గోపాలస్వామి అయ్యంగార్ నోటికి తాళం వేశారు. 1952లో మొదటిసారి రాజ్యసభకు ఎన్నికైన రాజ్ నాలుగేళ్లు ఆ బాధ్యతలు నిర్వహించిన తరవాత 1956లో మరోసారి ఎన్నికయ్యారు. 1962లో మూడోసారి ఎన్నిక కావడానికి అవకాశం ఉన్నా రాజ్ దాన్ని తిరస్కరించి కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ విభాగం కార్యదర్శిగా ఉండడానికే ఇష్టపడ్డారు. డా. రాధా కృష్ణన్ అన్నట్టు రాజ్ రుషే. అయితే విప్లవ రుషి. దశాబ్దాల పాటు రాజకీయాలలో ఉన్నా డబ్బు సంపాదించని అమాయకుడు.

ఒక్కో కుటుంబానికి రూ.25 వేల పొదుపు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఆప్ పథకాల వల్ల ఢిల్లీలో ఒక్కో కుటుంబానికి నెలకు రూ.25 వేల చొప్పున ఆదా అవుతోందని, ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు బీజేపీ ఎన్నికల్లో తలపడుతోందని ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కొత్తగా 'బచత్ పత్ర' ప్రచారాన్ని చేపట్టింది. ఇంటింటికి వెళ్లి 'ఆప్' పథకాల కింద ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతోంది, ఏమేరకు ఆదా అవుతోందనేది అంచనా వేయనుంది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ పథకాల వల్ల రూ.25 వేల చొప్పున ఆదా అవుతున్న కుటుంబాలు తిరిగి తమ పార్టీ చీపురు గుర్తుకు ఓటేయాలన్నారు. కొత్తగా హామీ ఇచ్చిన పథకాలతో మరో రూ.10 వేలు ఆదా అవుతుందని చెప్పారు. మేనిఫెస్టోలో విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణాలు, మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన వంటి ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. కాగా, శనివారం ప్రవేశపెడుతున్న బడ్జెట్ నేపథ్యంలో ఆప్ విధానాలు, బీజేపీ విధానాలకు ఉన్న తేడాను కేజ్రీవాల్ వివరించారు. బడ్జెట్‌తో సహజంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందని, కుటుంబాలపై ఆర్థిక ప్రభావం చూపుతుందని అన్నారు. కానీ, ఆప్ ప్రభుత్వం కుటుంబ పొదుపునకే ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ప్రజాధనాన్ని కార్పొరేట్ మిత్రులకు బీజేపీ ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 15న ఢిల్లీకి సరఫరా చేసిన నీటిలో అమ్మోనియా క్వాంటిటీ 3.22 పీపీఎం నుంచి 7 పీపీఎంకు పెంచారని, తనతో పాటు ఢిల్లీ ప్రజలు చేసిన పోరాటం వల్ల అమ్మోనియా క్వాంటిటీ 7 నుంచి 2.1 పీపీఎంకు తగ్గిందని చెప్పారు. ఢిల్లీ ప్రజలను అప్రతిష్టపాలు చేసేందుకు జరిగిన కుట్ర తెలిపారు.

కుంభమేళాకు వెళ్లి వస్తూ ఆరుగురి మృతి

ఘాజీపూర్: ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మహాకుంభమేళా భక్తులతో వెళ్తున్న వాహనాన్ని ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గోరఖ్‌పూర్‌కు చెందిన కొందరు భక్తులు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు పయనమయ్యారు. వారణాసి-ఘాజీపూర్ రోడ్డులోని నందగంజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఉస్మి కలా మలుపు వద్దకు రాగానే వారి వాహనాన్ని ఓ ట్రక్కు అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటన సమయంలో 20 మంది భక్తులు వాహనంలో ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతుల సంఖ్య దాస్తున్న యూపీ సర్కార్: అఖిలేశ్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో తొక్కిసలాటకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పష్టంచేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్ గురించి తర్వాత చర్చించవచ్చు. ముందు మహాకుంభమేళ ఘటన గురించి మాట్లాడాలి. కుంభమేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కోసం, శాంతి గురించి ఎంపీలు మాట్లాడాలి' అని అన్నారు. ఈ మహా కుంభమేళాలో ఎంతమంది చనిపోయారనేది యూపీ ప్రభుత్వం దాచిపెట్టి... పరిహారం చెల్లించడం లేదని ఆయన విమర్శించారు. మహా కుంభమేళా మరణాలపై యోగి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అఖిలేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యోగి ఆదిత్యనాథ్ నైతికంగా పతనమయ్యారని, అలాంటి వ్యక్తి రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారనేది ఇప్పుడు ప్రశ్న అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సైఫ్‌ను పొడిచింది అతడే

ఫేషియల్ రికగ్నైజేషన్‌తో నిర్ధారణ

ముంబై: దుండగుడి దాడిలో గాయపడిన బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కోలుకుంటున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముంబై పోలీసులు ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజీని ఉపయోగించి సైఫ్ నివాసంలోని సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించారు. ఆ వీడియోలో ఉన్నది నిందితుడు మహమ్మద్ షరీఫుల్ ఇస్లాం అని ఈ సాంకేతికత ద్వారా నిర్ధారించినట్లు వెల్లడించారు. ఇంతకుముందు... దాడి జరిగిన ప్రదేశంలో లభించిన ఫింగర్ ప్రింట్స్ నిందితుడితో సరిపోలడం లేదని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. జనవరి 16వ తేదీ తెల్లవారుజామున నిందితుడు సైఫ్ ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశాడు. విచారణలో భాగంగా నటుడి ఇంటిని పరిశీలించిన విచారణ అధికారుల బృందం అక్కడ ఉన్న దాదాపు 19 వేలిముద్రలు సేకరించింది. వాటిల్లో ఏవీ నిందితుడి ఫింగర్ ప్రింట్స్‌తో మ్యాచ్ కావడం లేదని పోలీసులకు ఫోరెన్సిక్ బృందం వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి.

ఈ కేసులో నిందితుడైన షరీఫుల్ ఇస్లాం దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే ఆ ఇంట్లోకి ప్రవేశించాడని, అయితే, పరిస్థితి తీవ్ర ఘర్షణకు దారితీసిందని ప్రాథమిక విచారణలో తేలింది. అందుకే దాడి సమయంలో సైఫ్ ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి దుస్తులపై రక్తపు మరకలు కనిపించడంతో అవి సైఫ్ అలీఖాన్‌వా... కాదా అని నిర్ధారించేందుకు నమూనాలు సేకరించారు.

హర్యానా ప్రభుత్వమే దోషి...

యమునా జలాల్లో విషంపై కేజ్రీవాల్: ఈసీకి ఆరు పేజీల సమాధానం

న్యూఢిల్లీ: యమునా జలాల్లో విషం కలిపినది హర్యానాలోని బీజేపీ ప్రభుత్వమేనని అని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. విషపూరిత జలాలను ఢిల్లీకి సరఫరా చేసిందని దుయ్యబట్టారు. నది జలాల్లో అమోనియా స్థాయి అత్యధికంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ ఆయన శుక్రవారం ఆరు పేజీల సమాధానాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి అందజేశారు. ఫిబ్రవరి 5న జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు హర్యానా సీఎం నాయాబ్ సింగ్ సైని ఈ మేరకు కుట్ర చేశారని ఆరోపించారు. ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు ఆతిశీ, భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఈసీ అధికారులను కేజ్రీవాల్ కలిశారు. అమోనియా అధికంగా ఉన్న నీటితో నింపిన మూడు సీసాలను ఎన్నికల సంఘం ముందర ఉంచారు. యమునా జలాల్లో కలిసిన విష పదార్థం అమోనియా అని కేజ్రీవాల్ వివరించారు. నది జలాల్లో విషం కలిసినట్లు ఆధారాలు ఉన్నాయంటూ ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ) మెథడాలజీని ప్రస్తావించారు. యమునా జలాల్లో జనవరి 15న 3.2 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్)గా ఉన్న అమోనియా స్థాయి... 26-27 తేదీల నాటికి ఏకంగా ఏడు పీపీఎంలకు పెరిగిందని వెల్లడించారు. ఈ విషయాన్ని సైని దృష్టికి పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. తాజా పరిణామాలను బట్టి హర్యానా ముఖ్యమంత్రి ప్రమేయం స్పష్టమవుతున్నదని చెప్పారు. దేశ రాజధాని ప్రజలకు ముప్పు వాటిల్లజేసేందుకు యత్నించిన సైనిపై క్రిమినల్ కేసు పెట్టాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. హర్యానా ప్రభుత్వంపై సీఈసీ చర్యలు తీసుకోకపోతే ఎన్నికల వేళ ఇలాంటి అక్రమాలను సర్వసాధారణం చేసిన వారు కాగలరని కేజ్రీవాల్ హెచ్చరించారు. హర్యానా ప్రభుత్వంపై చర్యలు తీసుకోవడానికి సీఈసీకి భయం ఎందుకు? ఢిల్లీ జలాలను కలుషితం చేయడం ఆపాలని హర్యానాకు ఎందుకు ఆదేశాలు ఇవ్వలేకపోతున్నారు? అని ఈసీ అధికారులను కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఢిల్లీలో బీజేపీ నేతల ద్వారా జరిగే ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై సీఈసీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు.

యమునా జలాలపై చేసిన ఆరోపణలకుగాను కేజ్రీవాల్ నుంచి ఎన్నికల సంఘం వివరణను కోరిన విషయం తెలిసిందే. ఈసీ నోటీసు అందిన తర్వాత కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడారు. ఈసీ నోటీసు తీరును బట్టి నన్ను శిక్షించాలని ముందే నిర్ణయించినట్లు అర్థమవుతోంది. బీజేపీ ఆదేశాలతో మీరు నాపై అక్రమంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా, ఏ శిక్ష విధించినా సంతోషంగా స్వీకరిస్తా. ఢిల్లీ ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన విషయంలో రాజీ ప్రసక్తే లేదు. ప్రజాస్వామిక సిద్ధాంతాల పరిరక్షణకు పోరాడుతా' అని ఢిల్లీ మాజీ సీఎం వెల్లడించారు.

రాష్ట్రపతి బాగా అలసిపోయారు: సోనియా

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ స్పందించారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను మీడియా పలకరించింది.

ఆ సందర్భంగా సోనియా మాట్లాడుతూ 'ప్రసంగం చివరకు వచ్చేసరికి రాష్ట్రపతి బాగా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు' అని బదులిచ్చారు. సోనియా వ్యాఖ్యలను బీజేపీ తప్పుపట్టింది. 'ఇవి అభ్యంతరకర వ్యాఖ్యలు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. ముఖ్యంగా రాష్ట్రపతిని ఉద్దేశించి చేయకూడదు. ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతిగా ఉన్నారు. కాంగ్రెస్ జమిందారీ ధోరణి ఆ విషయాన్ని అంగీకరించలేకపోతోంది. అందుకే ఆమె ప్రసంగాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు' అని బీజేపీ ఎంపీ సుకంతా మజుందార్ విమర్శించారు.

సోనియా వ్యాఖ్యలు సరికాదు

రాష్ట్రపతి భవన్

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయసభల్లో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి కార్యాలయం తప్పుబట్టింది. దేశంలోనే అత్యున్నత వ్యక్తి గౌరవానికి భంగం వాటిల్లేలా ఆమె ప్రవర్తించారని పేర్కొంది. రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు దురదృష్టకరమని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ నేతలు మాట్లాడకుండా ఉండాల్సిందని హితవు పలికింది. 'నిజాన్ని ఎవరూ దాచలేరని రాష్ట్రపతి కార్యాలయం చెప్పదలచుకుంది. ప్రసంగం సమయంలో రాష్ట్రపతి అలసిపోయినట్లు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు అవాస్తవం. ఆమె అసలు అలసిపోలేదు. అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల కోసం మాట్లాడుతున్నప్పుడు ఆమెకు అలసట దరిచేరదు. రాష్ట్రపతి ప్రసంగంపై వ్యాఖ్యలు చేసిన నాయకులకు భారతీయ భాష, యాసలతో పరిచయం లేకపోయి ఉండొచ్చు. అందుకే రాష్ట్రపతి అలసిపోయినట్లు వాళ్లకు అనిపించొచ్చు. ఏదేమైనా రాజ్యాంగబద్ధంగా అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు' అని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో తెలిపింది.

గిరిజనులను అవమానించడమే

సోనియా వ్యాఖ్యలపై ప్రధాని

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం 'పేలవం'గా ఉందంటూ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం తప్పుపట్టారు. రాష్ట్రపతి పార్లమెంటు ప్రసంగంపై చేసిన వ్యాఖ్యలను 'దురదృష్టకరం, పూర్తిగా నివారించదగినది' అని రాష్ట్రపతి భవన్ పేర్కొన్న కొన్ని గంటల తర్వాత ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ద్వారకలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ కుటుంబం 'అహంకారం ఈరోజు పూర్తిగా బయటపడింది' అని అన్నారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో ప్రసంగించారు. కానీ రాజకుటుంబ సభ్యురాలు ఒకరు ఆ భాష బోరింగ్‌గా ఉందని అన్నారు. ఒక సభ్యురాలు తన భాష అలసిపోయేలా అనిపిస్తుందని అంటున్నారు. అర్బన్ నక్సల్స్ మాటలు రాజకుటుంబానికి మరింత ఆసక్తికరంగా ఉంటాయి' అని ప్రధాని మోదీ అన్నారు. 'కాంగ్రెస్, ఆప్ రెండూ అహంకారాన్ని ప్రదర్శిస్తాయి. ఆప్ ఢిల్లీ తమ సొంతమన్నట్లుగా వ్యవహరిస్తుండగా, కాంగ్రెస్ కుటుంబం అహంకారం నేడు పూర్తిగా బయటపడింది. సోనియా గాంధీ వ్యాఖ్యలు పూర్తిగా అనుచితమైనవి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అలసిపోయినట్లు కనిపించి బోరింగ్ ప్రసంగం చేశారని చెప్పిన తర్వాత ఆమె 'పేలవం' అని అభివర్ణించారు. ఈ వ్యాఖ్య అధ్యక్షురాలిని మాత్రమే కాకుండా ప్రతి పేద, గిరిజన సమాజాన్ని కూడా అవమానిస్తుంది' అని తెలిపారు.

పూర్తిగా రాజకీయ ప్రసంగం

ప్రజా సమస్యల ఊసే లేదు: కాంగ్రెస్

న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం చేసిన ప్రసంగాన్ని 'స్పష్టమైన రాజకీయ ప్రసంగం' అని కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. దేశంలోని సాధారణ పౌరుడు రోజురోజుకూ ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎటువంటి ప్రస్తావనా లేదని తెలిపింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభాన్ని సూచిస్తూ పార్లమెంటు సంయుక్త సమావేశంలో ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము... కోవిడ్-19 మహమ్మారి, యుద్ధ సంబంధిత అనిశ్చితులు వంటి ప్రపంచ ఆందోళనలు ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థను 'విధాన పక్షవాతం' స్థితి నుంచి బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం బలమైన సంకల్పంతో పనిచేసిందని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం మూడవసారి పదవీకాలంలో గత పరిపాలనల కంటే మూడు రెట్లు వేగంగా పనులు జరుగుతున్నాయని, వక్ఫ్ బోర్డు, 'ఒకే దేశం ఒకే ఎన్నిక' వంటి అంశాలపై నిర్ణయాలను ఉటంకిస్తూ అన్నారు. ముర్ము ప్రసంగం గురించి అడిగినప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్ కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రపతితో 'స్పష్టమైన రాజకీయ ప్రసంగం' చేయించిందని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందిస్తూ, ఇది చాలా ఊహించదగిన ప్రసంగం అని, ఎటువంటి ఆశ్చర్యాలు లేవని అన్నారు. 'ఆమె సొంత ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఆమె పని, ఆమె అలా చేసింది. కానీ ఆమె ప్రసంగంలో ఏమి తొలగించబడ్డాయో, ప్రభుత్వం సాధించడంలో విఫలమైన విషయాల గురించి ప్రస్తావించకపోవడంపై మేము ఆందోళన చెందుతున్నాం. ఆర్థిక వ్యవస్థ పరిస్థితి, నేడు పేదలు, మధ్యతరగతి ప్రజలు బాధపడుతున్నారనే విషయం, నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉందనేది వాస్తవం. యువత రికార్డు స్థాయిలో నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారు. విద్యావంతులైన యువతకు కూడా ఉద్యోగాలు లేవు' అని థరూర్ తన పీటీఐ వీడియోలో అన్నారు. 'ఈ పరిస్థితులన్నింటిలోనూ మేము నిజంగా సవాలును ఎదుర్కొంటున్నాం. భారతదేశంలోని సాధారణ పౌరుడు రోజురోజుకూ ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ఎటువంటి అంగీకారం లేదు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ ముర్ము ప్రసంగం 'దురదృష్టవశాత్తు ప్రభుత్వం సాధించిన విజయాల జాబితాను ఆచారంగా పునరావృతం చేయడం తప్ప మరొకటి కాదు' అని తెలిపారు.

ప్రజా సమస్యలపై మాట్లాడరేం?

మోదీపై ప్రియాంకా గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ : 'అగ్ని రాజేయడానికి' విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నం జరగలేదంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా శుక్రవారం స్పందించారు. ప్రధాని మోదీ ప్రజల సమస్యల గురించి ఎప్పుడూ మాట్లాడరని, వాటిని పరిష్కరించరని అన్నారు. బడ్జెట్ సమావేశానికి ముందు విలేకరులతో మోదీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశం ప్రారంభానికి ముందు భారతదేశంలో 'అగ్నిని రగిలించడానికి' విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నం జరగకపోవడం బహుశా ఇదే మొదటిసారి' అని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ 'ఆయన ప్రజల సమస్యల గురించి మాట్లాడరు. వాటిని పరిష్కరించరు. గత సమావేశంలో మనం చూశాం. ఆయన చర్చను (అనుమతించలేదు). అందువల్ల ఆయన అలాంటి మాటలు చెబుతారు' అని అన్నారు. సమావేశానికి ముందు మోదీ ప్రతిపక్ష పార్టీలను విమర్శించారు. 2014 నుంచి ప్రతి సమావేశానికి ముందు దుష్ప్రవర్తన చేయడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులు ఉన్నారని, అలాంటి ప్రయత్నాలను ప్రేరేపించే వారికి కూడా కొరత లేదని అన్నారు. 'షాయద్ 2014 సే లేకర్ అబ్ తక్, యే పెహ్లా పార్లమెంట్ కా సత్ర్ హై, కి జిస్మే ఏక్-దో దిన్ పెహ్లే కోయి విదేశీ చింగారీ నహీ పక్డీ హై, దేశ్ మే సే ఆగ్ లగానే కి కోశిష్ నహీ హుయీ హై (బహుశా 2014 నుంచి పార్లమెంటు సమావేశానికి ఒకటి లేదా రెండు రోజుల ముందు, విదేశాల నుంచి మంటలను రేకెత్తించే విదేశీ ప్రయత్నం జరగని మొదటి సెషన్ ఇది)' అని తెలిపారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం స్పందిస్తూ, 'గత 10 సంవత్సరాలలో తన పర్యవేక్షణలో విదేశీ జోక్యం జరిగిందని ప్రధాన మంత్రి చెప్పడం ఆశ్చర్యకరం' అని అన్నారు. 'దేశంలోని అన్ని వ్యవస్థలను ఉపయోగించి, అంతర్జాతీయంగా ఆయనకు ఉన్న అన్ని వేదికలను ఉపయోగించి వాటిని బహిర్గతం చేయడం, చట్టబద్ధంగా వారిపై చర్యలు తీసుకోవడం ఆయన బాధ్యత' అని పేర్కొన్నారు.

ఢిల్లీ ఎన్నికలు... ఉల్లంఘనలపై 916 కేసులు

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 5న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల ప్రవర్తనా నియామవళి (ఎంసీసీ) ఉల్లంఘనలకు సంబంధించి 900కి పైగా కేసులు నమోదయ్యాయని శుక్రవారం ఒక అధికారి తెలిపారు. ఎంసీసీ అమలులోకి వచ్చిన జనవరి 7వ తేదీ నుంచి జనవరి 30 వరకు ఈ కేసులు నమోదయ్యాయి. ఈ కాలంలో ఎక్సైజ్ చట్టం కింద ఉన్నవారితో సహా వివిధ చట్టపరమైన నిబంధనల కింద మొత్తం 29,172 మందిని అరెస్టు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలకు ముందు, పోలీసులు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను ముమ్మరం చేశారు. ఆయుధాలు, మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాతో సహా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఢిల్లీ పోలీసులు ఎంసీసీ ఉల్లంఘనలకు సంబంధించి 916 కేసులను నమోదు చేశారు. 426 అక్రమ తుపాకులు, 487 కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆయుధాల చట్టం కింద 439 మందిని అరెస్టు చేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు 99,285 లీటర్ల మద్యం చేసుకుని 1,194 మందిని అరెస్టు చేశారు. రూ.75.4 కోట్లకు పైగా విలువైన 166.993 కిలోల మాదకద్రవ్యాలను, 1,200 కంటే ఎక్కువ నిషేధిత ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకుని ఇప్పటి వరకు 162 మందిని అరెస్టు చేశారు. చట్ట అమలు సంస్థలు రూ.10.10 కోట్ల నగదు, 37.39 కిలోల వెండిని కూడా స్వాధీనం చేసుకున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. 70 మంది సభ్యుల ఢిల్లీ అసెంబ్లీకి పోలింగ్ ఫిబ్రవరి 5న జరగనుంది. ఓట్లు ఫిబ్రవరి 8న లెక్కిస్తారు.

బీజేపీ విభజన రాజకీయాలు

ఆప్ నేత ప్రియాంక విమర్శ

న్యూఢిల్లీ: దేశంలో విభజన రాజకీయాలను బీజేపీ పెంచిందని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ తీవ్రంగా విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు ప్రజలకు విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలను సైతం కల్పించడంలో విఫలమయ్యాయని ఆమె దుయ్యబట్టారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'అమిత్ షా బీజేపీ పాలిత రాష్ట్రాలు 20 ఉన్నాయని చెబుతుంటారు. అయితే ఆయన చెబుతున్నట్లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నేటికీ 24 గంటల విద్యుత్ సౌకర్యం లేదు ఎందుకు? బహుశా ఉచిత విద్యుత్ సౌకర్యం అని చెబుతున్న వారి మాటలు ఒట్టి మాటలుగానే మిగిలిపోనున్నాయి' అని అన్నారు. మహా కుంభమేళా సందర్భంగా వీఐపీలు, వీవీఐపీలకు మాత్రమే యూపీ ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందని, సామాన్య భక్తుల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. ఆ ప్రభుత్వ నేతలు సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు కూడా యూపీ ప్రభుత్వంపై అక్షింతలు వేసిందని ఆమె అన్నారు. కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం ధనవంతులకే కాపు కాస్తోందని ఆమె ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఖజానా కూడా ధనవంతులవైపే మళ్లిందని, అమిత్ షా చెబుతున్నట్లు బీజేపీ పాలిత 20 రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రం కూడా ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. ప్రత్యేకించి బీజేపీ విభజన రాజకీయాలు పెంచుతుంది. ఢిల్లీలో కూడా పంజాబీలను బెదిరిస్తోంది.. పూర్వాంచలీలను అవమానిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీజేపీ ఖర్చు రూ.1,737 కోట్లు

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ రూ.1,737 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆ పార్టీ సమర్పించిన నివేదిక పేర్కొంది. ఈ మొత్తంలో... పార్టీ ప్రచారానికి రూ.884.45 కోట్లు, తన అభ్యర్థులకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.853.23 కోట్లు కేటాయించింది. పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా సహా మీడియా ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రచారం, కేబుల్, వెబ్‌సైట్, టీవీ ఛానల్స్ వ్యాప్తంగా పార్టీ అంశాల ప్రచారం నిమిత్తం దాదాపు రూ.611.50 కోట్లు ఖర్చు చేసింది. ఎన్నికల్లో ప్రచారాన్ని బలోపేతం చేయడానికి పార్టీ జెండాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లు వంటి ప్రచార సామాగ్రిపై కూడా రూ.55.75 కోట్లు ఖర్చు చేసింది. అదనంగా బహిరంగ సభలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ఆడియో ఏర్పాట్లు, బారికేడ్లు, వాహనాలు సహా వేదికల ఏర్పాటు కోసం రూ.19.84 కోట్లు వ్యయం చేసింది. అలాగే పార్టీ బడ్జెట్‌లో ప్రచారానికి సంబంధించిన ప్రయాణ ఖర్చులు మరో ముఖ్య భాగంగా ఉన్నాయి.

పార్టీ కేంద్ర ప్రధాన కార్యాలయం అధికారం ఇచ్చిన స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణ ఖర్చు రూ.168.92 కోట్లు కాగా, ఇతర నాయకుల ప్రయాణానికి రూ.2.53 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది.

సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ... ప్రచారంపై ఎక్కువగా ఆధారపడిందని దాని ఖర్చు విధానాల నుంచి స్పష్టమవుతోంది.

ఢిల్లీలో క్షీణించిన గాలి నాణ్యతలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో గాలి నాణ్యతలు మరోసారి క్షీణించాయి. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఏక్యూఐ (గాలి నాణ్యతలు) 349 స్థాయిల్లో నమోదైందని, ఏక్యూఐని వెరీ పూర్ కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఢిల్లీలో గరిష్టంగా 26 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, ఏక్యూఐ 50గా నమోదైతే గుడ్, 101 నుంచి 200 మధ్య నమోదైతే మధ్యస్థమని, 201 నుంచి 300 మధ్య నమోదైతే పూర్, 301 నుంచి 400 మధ్య నమోదైతే వెరీ పూర్, 401-500 మధ్య నమోదైతే తీవ్రస్థాయిలో గాలి నాణ్యతలు వర్గీకరించనున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

ఇప్పుడే విదేశీ జోక్యం లేదు

ప్రతిపక్షాలపై మోదీ విసుర్లు

న్యూఢిల్లీ: తాము ప్రవేశపెట్టే కొత్త బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ప్రధాని నరేంద్రమోదీ భరోసా ఇచ్చారు. అలాగే పదేళ్ల కాలంలో పార్లమెంట్ సమావేశాలకు ముందు ఈసారే విదేశీ జోక్యం కనిపించలేదని విపక్షాలపై ఎదురుదాడికి దిగారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభానికి ముందు శుక్రవారం ప్రధాని మీడియాతో మాట్లాడారు. 'పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలి. భారత శక్తిసామర్థ్యాలు మనకు విశేష గుర్తింపు ఇస్తాయి. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. మూడోసారి పార్లమెంట్‌లో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెడుతున్నాం. ఈ వార్షిక పద్దు ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుంది. భారత్ అభివృద్ధి లక్ష్యంతో మిషన్ మోడ్‌లో ముందుకెళ్తున్నాం. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నాం. కొత్త విధానాలపైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. పార్లమెంటులో చరిత్రాత్మక బిల్లులు ప్రవేశపెడుతున్నాం. పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందని, ఉభయసభలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని భావిస్తున్నాను' అని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు .

విశాలాంధ్ర హైదరాబాద్

ఫామ్ హౌస్‌లో ఉండి మాట్లాడతారా... అసెంబ్లీకి వస్తారా ?

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత కొన్ని రోజులుగా కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం కానీ ఆయన ఫామ్ హౌస్‌లోనే ఉండి మాట్లాడతారా లేదా అసెంబ్లీకి కూడా వస్తారా అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ 13 నెలల పాటు ఫామ్ హౌజ్ కే పరిమితమై ఇంతకాలం మౌనంగా ఉన్నానని ఇప్పుడేదో అంటే సరిపోదని చురకలు అంటించారు. ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరిగి ప్రజా సమస్యలు ప్రస్తావించాలన్నారు. వర్షాలు వచ్చినా, వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదని, ఫామ్ హౌస్ దాటలేదని విమర్శించారు. అధికారంలో ఉన్ననాడు సచివాలయానికి రాలేదు ఇపుడు ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి రాలేదు, ప్రజల్లోకి రాలేదు కేసీఆర్ జీవితమంతా ఫామ్ హౌసేనా అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని కేసీఆర్ వ్యాఖ్యలు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయి. ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్నారని తెలిపారు. ప్రజలన్నా ప్రజాతీర్పు అన్నా కేసీఆర్‌కు ఏనాడూ గౌరవం లేదని, పదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ఓడిపోయిన తర్వాత ఈ రోజు వరకు కూడా కనీసం కృతజ్ఞత తెలపలేదని దుయ్యబట్టారు. ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని కూడా ప్రకటించలేదని, ఈ ఏడాది కాలంలో నల్గొండ, కరీంనగర్ బీఆర్ఎస్ సభల్లో కూడా ఈరోజు మాదిరిగానే గంభీర ప్రకటనలే చేశారని, ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందే అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షనేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి తన ఉనికిని చాటుకోవడానికి, నేనున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టల దొర మాదిరి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఏదో నమ్మి ఓటేశారని అంటున్నావని, వాస్తవాలు గ్రహించి నీ గడీల పాలన వద్దనుకుని ప్రజలు నిన్ను నీ కుటుంబాన్ని ఛీత్కరించారని తెలిపారు. పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌజ్‌లో కూర్చొని మాట్లాడటం కాదు, ఇప్పటికైనా ప్రజల్లోకి రావాలనే మేమంటున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి పదే పదే ఆహ్వానించారని, 80 వేల పుస్తకాలు చదివినారు మరి అలాంటి మీ అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వాలని అసెంబ్లీకి రమ్మంటే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 2020 రెవెన్యూ చట్టం దేశానికే ఆదర్శమని ప్రకటించిన మీరు భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిననాడైన అసెంబ్లీకి వస్తారని ఆశించామని తెలిపారు. నీ ఫామ్ హౌజ్‌కు కరెంటు కోతలెక్కడివి, లెక్కలు తీద్దామా, ఏ రోజు ఎంత కరెంటు సరఫరా అయింది, ఎంత సరఫరా అవుతుంది, నీ ఫామ్ హౌజ్‌కు నీళ్లెక్కడివని నిలదీశారు. రైతు భరోసా ఇచ్చిందే మేము, రాష్ట్రంలో ఉచిత కరెంట్ తెచ్చిందే కాంగ్రెస్, చరిత్ర ప్రజలకు తెలియదా అంటూ చెపుకొచ్చారు. నీవంటున్న గురుకులాలను సందర్శిద్దామా, నీవెక్కడి కంటే అక్కడికి రావడానికి మేము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. అద్దెగదుల్లో పెట్టి విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసిన మీరా మాట్లాడేదంటూ విమర్శించారు. రైతుల రుణమాఫీ కోసం 20 వేల కోట్ల రూపాయలు ఇచ్చిన సంగతి కళ్లకు కనిపించడం లేదా అని మండిపడ్డారు. అభివృద్ధి మీద చర్చకు సిద్ధమా, ఏదైనా మాట్లాడితే దానికొక ప్రాతిపదిక ఉండాలన్నారు. ముస్లింలను కాంగ్రెస్ వాడుకుంది అంటున్నావు కానీ వాస్తవానికి వాడుకుని వదిలేసే చరిత్ర నీదే అంటూ విమర్శలు చేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హెచ్ఎండిఏ గ్రౌండ్స్ ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డు భద్రత అవగాహన నెక్లెస్ రోడ్ నుంచి ప్లాజా వరకు నిర్వహించిన వాకథన్ కార్యక్రమంను జెండా ఊపి ప్రారంభించి వాగథన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. రహదారి భద్రత మన అందరి బాధ్యత సమాజిక బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి రహదారి భద్రతను పాఠ్యాంశంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు రక్షించాలని అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు జనవరి 1న ముఖ్యమంత్రికి హెల్మెట్ ధరించి ప్రారంభించిడం జరిగిందన్నారు. దాదాపు 15 లక్షల మంది విద్యార్థులను ప్రజలను భాగస్వామ్యం చేసి 33 జిల్లాల్లో అనేక కార్యక్రమాలు చేసిన రవాణా శాఖ అధికారులకు మంత్రి ఈ సందరరేగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైతే ప్రమాదాలు జరిగే ప్రాంతాలు బ్లాక్ స్పాట్స్‌లను ప్రాంతాలు గుర్తించివాటిని తొలగించి అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చూస్తుందన్నారు. రహదారి భద్రత రాబోయే కాలంలో విద్యార్థులు చదువుకోవడానికి పాఠ్యాంశం పెట్టే కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం చూస్తుందన్నారు. రవాణా శాఖ అధికారులు,ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. చట్టంలో ఎవరైతే ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తారో వాళ్ళకి భవిష్యత్‌లో లైసెన్స్ లేకుండా రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. అవగాహన కల్పించిన తరువాత కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే ట్రాఫిక్ పోలీస్ సహకారంతో కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. నిబంధనలు ఉల్లగించి ప్రాణాలు పోవడానికి కారకులైన వారిని ఒక దోషిగా నిలబెట్టే ప్రచారం చేసే కార్యక్రమాన్ని తీసుకుంటామన్నారు. ప్రచారం సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రతలో ప్రజలు భాగస్వామ్యం అయితే ప్రమాదాలు నివారించ వచ్చని మంత్రి తెలిపారు. వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా 2025 మాసోత్సవాలు గతంలో ఎప్పుడూ లేని విధంగా 33 జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారని, రోడ్డు భద్రత మాసోత్సవం పండగ లాగ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది భాగస్వామ్యం అయ్యారన్నారు. దేశంలో వేరే రాష్ట్రాలలో పోలిస్తే తెలంగాణలోనే బాగా చేయడం జరిగిందని తెలిపారు.

కేసీఆర్‌వి అన్నీ ప్రగల్బాలే : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కేసీఆర్ ఫాం హౌస్ కలలు మానుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో కేసీఆర్ అభ్యర్థుల కోసం ఇటువంటి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ప్రజలు ఫాం హౌస్ పాలనలో గడీల పాలన కోరుకోవడం లేదని, ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించడంతో ఆయన దిక్కుతోచక మాట్లాడుతున్నారని ఉన్నారన్నారు. ఆయన వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూరుకుపోయిన కేసీఆర్ కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు రావడంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దెదింపినా, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా గుణపాఠం నేర్వని కేసీఆర్ ఫాం హౌస్‌లో పగటి కలలు కంటున్నారని ఏదేవ చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేయడం ఆయనకు కనిపించడం లేదా అని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిన ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఎదురుచూస్తే పట్టించుకోని కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల వరకు రేషన్ కార్డులు ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితో బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడడంతో, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌పై అవాకులు చెవాకులు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ వ్యవహార శైలి, మాటతీరులో మార్పు రాకుంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు ఎన్ని సార్లు సవాలు విసిరినా స్పందించని కేసీఆర్ పామ్‌హౌస్‌లో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు.

బీజేపీ పాలనలో దళిత సంక్షేమానికి నిధుల కోత

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత సంక్షేమానికి నిధుల కోతతో పాటు, దళితులపై దాడులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దళితుల రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ఆఫీస్ బేవర్స్ సమావేశం సమావేశం కే.యేసు రత్నం అధ్యక్షతన రాజ్ బౌదుర్ గౌర్ హాలు హిమాయత్‌నగర్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాల నరసింహ మాట్లాడుతూ రాజ్యాంగ భద్రతలు, దళితుల భద్రత, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, వారి జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమం ద్వారా దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను ఏర్పాటు చేయడమే లక్ష్యం కోసం దీర్ఘకాలిక ఉద్యమాల ద్వారా మాత్రమే సాధించుకోగలుగుతామని అన్నారు. దళిత కుటుంబాలు పరిమిత విద్య ద్వారా కొన్ని ఉద్యోగాలను పొందగలుగు తుండగా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం ప్రైవేటీకరిం చడం ద్వారా ఈ వాళ్లకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేటీక రణను నిలిపివేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, సామాజికంగా గుర్తింపు లేని దళితులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడమే సబ్‌ప్లాన్ ఉద్దేశం అన్నారు. అయితే ప్రభుత్వం ఈ నిధులను దళితుల ప్రత్యేక కార్యక్రమాలపై దృష్టి పెట్టకుండా సాధారణ కార్యక్రమాలకు మళ్లిస్తోంది. అసైన్డ్ భూములు కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఇచ్చినవేనని అన్నారు. 1977లో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం అసైన్డ్ భూములను విక్రయిం చడం, కొనుగోలు చేయడం, బ్యాంకులలో తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి అవకాశం లేకపోవడంవలన పేదలు, అసైన్డ్ రైతులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, పేద ఆసైన్డ్ రైతులకు మేలు జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ఆయన కోరారు. గత ప్రభుత్వంలో దళితుల నుండి అభివృద్ధి పేరుతో లాగేసుకున్న భూమికి భూమి తిరిగి దళితులకి ప్రభుత్వ భూములను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జనవరి 26న అత్యంత కిరాతకంగా హత్య గావింపబడిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాలబంటి మీ కుల దురహంకార హత్యకు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని పౌర సమాజం మానవీయ కోణంలో ఈ హత్యలను ఖండించాలని అయన కోరారు. యం.అనిల్ కుమార్, కే.సహదేవ్, ఏ.రాజ్ కుమార్, జే.కుమార్ స్వామి, టీ.రామకృష్ణ, కే.వెంకటస్వామి, వై.ఉషశ్రీ, బి.లక్ష్మీపతి, కే.రాజరత్నం పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడ్మిన్ జాయింట్ కమిషనర్ ఎస్.వి. జానకి రామ్ సాగర్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 15 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌వి జానకి రామ్ సాగర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి ముమ్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు.

పదవీ విరమణ పొందిన వారి వివరాలు...

పి.రఘునందన్ రాజు (డిప్యూటీ సిటీ ప్లానర్), సుదర్శన్ (డిప్యూటీ ఇంజనీర్), ఇ.ధానేశ్వర్ (అసిస్టెంట్ సిటీ ప్లానర్), అజీజున్నీసా (సూపరింటెండెంట్), ఎస్.కృష్ణ (హెచ్.వి.డ్రైవర్), పి.రాములు (అటెండర్/చైన్ మెన్), పి.రమేష్ (నాన్ పి.హెచ్ వర్కర్), మహేందర్ రెడ్డి (శానిటరీ జవాన్), ఎన్.దుర్గయ్య (శానిటరీ జవాన్), కె.శ్రీహరి (మాన్ మజ్దూర్), బి.రాములు (లైన్ మెన్), రెహానా సుల్తానా (బిల్ కలెక్టర్), టి.వినోద్ సింగ్ (మాన్ మజ్దూర్), జగదీష్ (చైన్‌మెన్), టి.శాంసన్ (స్వీపర్). ఈ కార్యక్రమంలో పిఆర్‌ఓ విజయలక్ష్మి, ఏఎంసిలు జీవన్ కుమార్, శారద, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు నివాళి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శామీర్ పేట్ మండలంలోని దేవరయంజాల్ గ్రామంలో గల కమ్యూనిటి హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బి.వెంకయ్య హాజరయ్యారు. అంబేద్కర్ ఫోటోకు, విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రజలు ఇచ్చిన అభ్యర్థనలను ఛైర్మన్ స్వీకరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఒ ఉపేందర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో కాంట్రాక్ట్ వైద్య పోస్టుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉస్మానియా మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన తాత్కాలిక పద్దతిన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల నియామకానికి అర్హులైన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి 3 నుండి 5 వరకు ఉస్మానియా మెడికల్ కళాశాల హైదరాబాద్ ప్రిన్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 5 సాయంత్రం 5 వరకు ఉంటుందని అయన తెలిపారు. మరింత సమాచారం కోసం అప్లికేషన్‌ల కోసం, అధికారిక వెబ్‌సైట్ https://omc.ac.in ని చూడాలని తెలిపారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల చెరువు నుండి బీహెచ్‌ఈఎల్ చౌరస్తా గ్యాస్ గోడౌన్ నాల వరకు ఎస్.ఎన్.డి.పి ఆధ్వర్యంలో హైటెక్ సిటీలో భాగంగా రూ. 28 కోట్లు 45 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపట్టబోయే ఓపెన్ డ్రైన్ ఆర్‌సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం పనులకు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్యఅతిథిలుగా పాల్గొని శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఆరెకపూడి గాంధీని, శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌ని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నాలాల విస్తరణ పనులు చేపట్టడం ద్వారా లోతట్టు, ముంపు ప్రాంతాలకు స్థిరమైన ఉపశమనం కల్పించనున్నామని తెలిపారు. బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, రాబోయే వర్షాకాలానికి ముందే స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపుతున్నామని అన్ని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. సమస్యలను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఆదర్శవంతమైన గచ్చిబౌలి డివిజన్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు డిఈ ఆనంద్, ఈఈ దుర్గా ప్రసాద్, ఎస్.ఎన్.డి.పి డిఈ రాజు, ఎస్.ఎన్.డి.పి ఈఈ సత్యనారాయణ, గచ్చిబౌలి డివిజన్ ఉపాధ్యక్షులు తిరుపతి, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్, సుమన్, శంకర్, శ్రీను, స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రముఖ నిర్మాత వేదరాజు కన్నుమూత

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగు సినీ పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నిర్మాత వేదరాజు టింబర్ (54) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆయన, హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. అల్లరి నరేష్‌తో 'మడత కాజా', 'సంఘర్షణ' వంటి చిత్రాలను నిర్మించారు వేదరాజు టింబర్. సినిమాలపై ఇష్టంతో ఓ వైపు కన్‌స్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలను నిర్మించారు. త్వరలో మరో చిత్ర నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే ఈ విషాద సంఘటన జరిగింది. గత కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో ఆయన చికిత్స తీసుకుంటున్నారు. త్వరలోనే కోలుకుని వస్తారని సన్నిహితులు, కుటుంబ సభ్యులు భావిస్తున్న తరుణంలో ఇలా జరగటం వారందరిలో విషాదాన్ని నింపింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.

పర్యాటక శాఖ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించారు. తదుపరి సమావేశంలో ఉద్యోగుల సమస్యల గురించి చర్చించి పరిష్కారిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక శాఖ కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ యూనియన్ అధ్యక్షులు, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోస్, తెలంగాణ పర్యాటక శాఖ కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగుల సంఘం జనరల్-సెక్రటరీ సబ్బు రాజమౌళి, సమస్త ఉద్యోగులు జి.శంకర్ రావు, ఎస్.బల్వీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాగాయకుడు గద్దర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : అట్టడుగు వర్గాల, ముఖ్యంగా దళితులు, వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కలం, గళం ద్వారా పోరాడిన మహా గాయకుడు గద్దర్ అని తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల కొనియాడారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తరపున శుక్రవారం, "మహా బోధి" విద్యాలయం, భూదేవి నగర్, వెంకటాపురం, అల్వాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలకు తెలంగాణ సాంస్కృతిక సారధి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అట్టడుగు వర్గాల, ముఖ్యంగా దళితులు, వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కలం, గళం ద్వారా పోరాడిన మహా గాయకుడు గద్దర్ అన్నారు. తెలంగాణరాష్ట్ర సాధనలో ముందుండి పోరాడి రాష్ట్ర సాధనలో తన వంతు కృషి చేసారని, ప్రేరేపిత పాటలను రచించి పాడి ప్రజలలో చైతన్యం నింపారని ఛైర్మన్ అన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని అల్వాల్‌లో గద్దర్ స్థాపించిన మహాబోధి పాఠశాలలో గద్దర్ జయంతి వేడులకు నిర్వహించడం చాలా అనందంగా ఉందన్నారు. ఛైర్మన్ గద్దర్ పాటలను పాడి అందరిని ఉత్తేజపరిచారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు గద్దర్ రచించిన పాటలు పాడి గద్దర్ జయంతి వేడుకలను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వేడుకలలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం వారు ఎంతగానో సహకరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఎంతో ఆకర్షనీయంగా నిలిచాయి. గద్దర్ భార్య విమల, కుమారుడు సత్యం హాజరై గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

యుటిలైజేషన్ సర్టిఫికెట్‌లను సేకరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీల సంక్షేమలో భాగంగా అందించిన ఆర్థిక సహాయంనకు సంబంధించిన యూటీలైజేషన్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 10లోగా సేకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి ప్రత్యేక అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ల కోసం నియమించబడిన ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో హైదరాబాద్ జిల్లాలో జూన్ నుండి అక్టోబర్ 2023 వరకు కింద 5732 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగిందని దానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు 2734 లబ్ధిదారుల నుండి మాత్రమే సేకరించిరించడం జరిగిందని మిగతా 2998 లబ్ధిదారుల నుండి పెండింగ్ యూటీస్లైజేషన్ ధ్రువీకరణ పత్రాలను ఫిబ్రవరి 10లోగా సేకరించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. యూటీలైజేషన్ సర్టిఫికెట్ల సేకరణకు 17 మంది ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారులు కార్యచరణ రూపొందించుకొని యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సేకరించాలని ఆయన 17 మంది స్పెషల్ ఆఫీసర్స్,16మంది జి.హెచ్.ఎంసి డిపీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, సిపిఓ డాక్టర్ సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్, ఎడి డిజేబుల్ వెల్ఫేర్ రాజేందర్, డిడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీరామ్, జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పవన్ కుమార్, వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక అధికారులు, డిపిఓ పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులు పంపిణీ



విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మల్కాజిగిరి సర్కిల్ ఆరు డివిజన్‌లోని లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లలకు పెద్దన్నగా ఆలోచించి, ఆడపిల్లల వివాహాలకు సహకరించాలనే సహృదయయంతో కేసిఆర్ ప్రారంభించారన్నారు. కళ్యాణలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరచిన తులం బంగారాన్ని కూడా లబ్దిదారులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మండల తహసీల్దార్ సీతారాం, కార్పొరేటర్లు మేకల సునీత యాదవ్, శ్రావణ్ కుమార్, సునీత శేఖర్ యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల అంజయ్య, బద్దం పరశురామ్ రెడ్డి, కరం చంద్, జగదీష్ గౌడ్, మురుగేష్, రాము యాదవ్, భాగ్యానంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం కొండ బ్రహ్మోత్సవాలకు సీఎంకు ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మన్యం కొండ దేవస్థానం పాలకమండలి చైర్మన్, సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో కలిసి మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, బ్రహ్మోత్సవాలకు వచ్చే తేదిని ఎమ్మెల్యేతో సంప్రదించి త్వరలో ఖరారు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మన్యం కొండ దేవస్థానం పాలకమండలి చైర్మన్ అలహరి మధుసూదన్ చారి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేశ్‌పాండే ఫౌండేషన్ ఫౌండేషన్ సేవలు విస్తరించాలి...

సామాజిక సేవలో పేరుపొందిన ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థ దేశ్‌పాండే ఫౌండేషన్ తెలంగాణలో సేవలను విస్తరించడానికి ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులు ముఖ్యమంత్రిని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దేశ్‌పాండే ఫౌండేషన్ సేవా కార్యక్రమాల విస్తృతి పైన చర్చించారు. దేశ్‌పాండే ఫౌండేషన్ అమెరికాతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలలో, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పనిచేస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇవ్వడం విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడం వంటి కార్యక్రమా లను నిర్వహిస్తుందని దేశ్‌పాండే ఫౌండేషన్ వ్యవస్థాప కులు ముఖ్యమంత్రికి తెలిపారు. దేశ్‌పాండే ఫౌండేషన్ వారిని ముఖ్యమంత్రి అభినందిస్తూ, రాష్ట్రంలో ఉన్న కస్తూర్బా బాలికల పాఠశాల నిర్వహణలో పాలుపంచు కుంటే సముచితంగా ఉంటుందని, అలాగే మహబూబ్ నగర్‌లోని బాలికల విద్యాభివృద్ధి కోసం ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలను, ఎంవిఎస్ డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని సీఎం దేశ్‌పాండే ఫౌండేషన్ వారికి సూచించారు. సీఎం సూచనలను దేశ్ పాండే ఫౌండేషన్ వారు అంగీకరించారు. మహిళా విద్యాభివృద్ధి, సమగ్ర అధ్యయనం కోసం ఫిబ్రవరి 6వతేది నుంచి 8వ తేదీ వరకు కర్నాటక రాష్ట్రంలోని హుబ్లీలో జరగనున్న కాన్ఫరెన్స్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేశ్‌పాండే ఫౌండేషన్ వ్యవస్థాపకులు గురు రాజ్ దేశ్‌పాండే, జయశ్రీ దేశ్‌పాండే, స్టార్ టాప్స్ రాజు రెడ్డి ప్రతినిధి జి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుఱ్ఱపు డెక్కను యాంత్రిక పద్ధతిలో తొలగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్

విశాలాంధ్ర - కాప్రా : నాచారం ఎర్రకుంట చెరువులో పేరుకుపోయిన గుఱ్ఱపు డెక్కను యాంత్రిక పద్ధతిలో జేసీబీ ద్వారా తొలగించాలని, గుఱ్ఱపు డెక్కను కార్మికుల చేత తీయించడం దుర్మార్గమైన చర్య అని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. నాచారంలోని ఎర్రకుంట చెరువును సీపీఐ బృందం పర్యటించి, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి అధికార యంత్రాంగం కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరుస్తుందని అన్నారు. యంత్రాలతో జరిగే పనిని కార్మికులతో చేయించడం వలన కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. గుఱ్ఱపు డెక్క చెరువు నుండి తొలగించే క్రమంలో చెరువులో చనిపోయిన జంతు వులు, పాములు ఉండడం వాటిపై క్రిములు ఉన్నాయని, చెరువు అంతా దుర్గంధంతో వాసన వలన కార్మికులు రోగాల బారిన పడుతున్నారని, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మికులు తమకు చెప్పారన్నారు. ఎంటమాలజీ డిపార్ట్మెంట్ అధికార యంత్రాంగం కార్మికుల విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి కనబర్చవద్దని, సానుకూల పద్ధతిలో కార్మికుల న్యాయ్యమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్‌రావు, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్, మురళి, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం పరిధి 125 - డివిజన్ గాజుల రామారం గ్రామం నందు షాపూర్ నగర్, గాజుల రామారం ఆర్యవైశ్య సంఘంల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దయతో ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఎల్లప్పుడు జీవించాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానందని ఆర్యవైశ్య సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, చెట్ల వెంకటేష్, చిన్న చౌదరి, చందు సుంకరి, వహీద్, వెంకటేష్, బద్రి, నారాయణ, గౌస్, ప్రసాద్, గాజుల రామారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు పవన్ గుప్తా, శేకర్, ప్రభాకర్, జగదీష్, సంతోష్, హర్ష, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ డైరీని ఆవిష్కరించిన తుంగతుర్తి రవి

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి శుక్రవారం ఉదయం ఏ.ఐ.ఎస్. ఎఫ్. డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ విద్యా రంగంలో సంఘటిత చైతన్యం ఎంతగానో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఏ.ఐ.ఎస్.ఎఫ్. చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. అలాగే, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం, విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరచడం అవసరమని ఆయన అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజహితానికి దోహదపడే కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి.అన్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకులు కొత్తపేట సాయికుమార్, సాయి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఓబీసీలో లేని 40 కులాలను చేర్చేలా ప్రతిపాదనలు

మంత్రి పొన్నం ప్రభాకర్‌తో బీసీ కమిషన్ సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. ఇప్పటికే బీసీ కమిషన్ 10 ఉమ్మడి జిల్లాల పర్యటన తరువాత వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొన్ని కులాల పేర్లు మార్పు ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించిన తరువాత వచ్చిన అన్ని అంశాలను బిసి కమీషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అన్ని విషయాలు సవివరంగా చర్చించినారు. వివిధ విజ్ఞప్తులను వాటి పర్యవసానాలను మంత్రితో కూలంకషంగా చర్చించడం జరిగింది. సెంట్రల్ ఓబీసీ లిస్ట్‌లో లేని 40 కులాలను సెంట్రల్ ఓబీసీ లిస్ట్‌లో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వం తరపున మరోసారి ప్రతి పాదన పంపాలని నిర్ణయించటం జరిగింది. బిసిల అభ్యున్నతికి కమీషన్ మంత్రిత్వ శాఖ చర్చలు జరిపి కొన్ని కీలక అంశాలతో ముందుకు పోవాలని నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్, మెంబర్ సెక్రటరీ బాల మాయాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

థీమ్ పార్కు తరహాలో అభివృద్ధికి ప్రతిపాదనలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రజలకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని అందించేలా పార్కులను సుందరీకరించే దిశగా చర్యలు చేపడతామని చందానగర్ సర్కిల్ ఉప కమీషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విలువైన పార్కు స్థలాల రక్షణతో పాటు విభిన్నమైన థీమ్ పార్కు తరహాలో అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని అపర్ణ కమ్యూనిటీలో జీహెచ్‌ఎంసీకి చెందిన ఎకరానికి పైగా పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని అపర్ణ కమ్యూనిటీ ఫెడరేషన్ అధ్యక్షురాలు రాణిరెడ్డి నేతృత్వంలో సభ్యులు రెండు రోజుల క్రితం డీసీని కలిసి విన్నవించారు. ఈ మేరకు వారి విన్నపంతో బయోడైవర్సిటీ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, సానిటేషన్ విభాగాలతో కలిసి డీసీ మోహన్‌రెడ్డి శుక్రవారం సదరు పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విలువైన పార్కు స్థలం ఆక్రమణకు గురి కాకుండా ప్రహరీ పునర్నిర్మాణం చేయాలని, పార్కు లోపల చెత్త, అవసరపు చెట్ల తొలగింపు సహా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఫెడరేషన్ భాగస్వామ్యంతో పార్కును సుందరీకరించి థీమ్ పార్కు తరహాలో అభివృద్ధికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈఈ కేవీఎస్ఎన్‌రాజు, డీఈ దుర్గాప్రసాద్, డాక్టర్ రవి, టీపీఎస్ రాకేష్, యుబీడీ అధికారి సమీర, ఫెడరేషన్ ప్రతినిధులు విక్రమ్, రమేష్, డాక్టర్ రాజారామ్, డాక్టర్ నారాయణరెడ్డి, పద్మ, రాగిణి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యను మానవీయ కోణంలో చూడాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంలో ఆలోచించి ఒత్తిడులకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా చట్టపరమైన న్యాయం అందించే దిశగా జిల్లాయంత్రాంగం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య కోరారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ వెంకటయ్య హాజరైనారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి వాటిని తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలని ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్)-పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ-పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు వాటి పురోగతిని ఛైర్మన్ అడిగి తెలుసుకొన్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏమాత్రం పెండింగ్లో ఉంచరాదని ఆయన సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేసి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత అధికారులు పూర్తి నిబద్ధతతో తమ విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిడులు వస్తుంటాయని దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని ఛైర్మన్ స్పష్టం చేశారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన వెంటనే త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ మానిటరింగ్ కమిటీకి అధ్యక్షత వహించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం మాట్లాడుతూ కమీషన్ అందించిన సూచనలు పాటిస్తూ, సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన భూసమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను 15 పని దినాలలో అందజేయాలని ఆర్డీఓలను, తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం ప్రజలు అందించిన వినతులను ఛైర్మన్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపిలు కోటిరెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఏస్సి,ఏస్టి కమీటీ మెంబర్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌కు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర - దుండిగల్: నియోజక వర్గం దుండిగల్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్ నాయక్‌ని శుక్రవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి విగ్నేశ్వర్ చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యామ్‌రావు, మున్సిపల్ జీఎస్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఆకుల మల్లేష్, యాదగిరి, యువమోర్చ నాయకులు ఆకుల విజయ్, వెంకటేష్ నాయక్, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా : పిసరి

విశాలాంధ్ర- దుండిగల్ : మున్సిపాలిటీ అభివృద్ధికి పట్టుదలతో కృషి చేస్తానని మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి. పోచంపల్లి డబల్ బెడ్రూమ్ ఇండ్లు 6 బ్లాక్ నందు బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పీసరి కృష్ణా రెడ్డి ఎంపీ లాడ్స్ రూ.2 లక్షల నిధుల ద్వారా కాలనీ నందు నూతన బోర్ వెల్ ను ఆయన చేతులు మీదుగా ప్రారంభించారు.అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టాలెక్కించే అవకాశం ఆయనకు కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు స్థానిక నాయకులు, ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి విగ్నేశ్వర్ చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యామ్‌రావు, మున్సిపల్ జీఎస్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఆకుల మల్లేష్, యాదగిరి, యువమోర్చ నాయకులు ఆకుల విజయ్, వెంకటేష్ నాయక్, యశ్వంత్ రెడ్డి, అఖిల్ గణేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - అమనగల్లు : జమీందారుల అరాచకాలను సహించలేక కత్తిపట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, వంశీ చంద్ రెడ్డి,బిసి సంఘం జాతీయ అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆయన పేదోళ్ల రాజు అని కొనియాడారు. గురువారం అమనగల్లు పట్టణంలోని కాటమయ్య గుట్టపై పబ్బతి ఆంజనేయస్వామి, ఆంజనేయస్వామి, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, నవగ్రహాలు, కౌండిన్య మహర్షి, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని గౌడ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాజకీయ, ఆర్థిక సాంఘిక సమానత్వం కోసం పోరాడారు మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, బహుజనుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని, ఆయన సేవలు చిరస్మరనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కులమతాలకు అతీతంగా పాపన్న ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న అని పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేసినవారిని అభినందించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమాలలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నీటి మీద నీచ రాజకీయం : ఎమ్మెల్సీ కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : నీటి మీద రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కార్ నీచ రాజకీయం చేస్తుందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. నీటి విషయాల్లో రాజకీయం చేయడం మానేసి నిజాలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందని అన్నారు. శుక్రవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో "నీళ్లు - నిజాలు"పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. రాజకీయాలకు అతీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడి, కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతజ్ఞతను ప్రదర్శించాలని సూచించారు. వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీని కేసీఆర్ కొనసాగించారని, అలాగే వారు ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ కొనసాగిస్తోన్న తరుణంలో కేసీఆర్ ప్రారంభించిన పనులను సీఎం రేవంత్ రెడ్డి కొనసాగించాలన్నారు. కృష్ణ ట్రిబ్యునల్‌లో రాష్ట్రం తరపున బలంగా వాదనలు వినిపించాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందిస్తే తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించామన్నారు. కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని, అదేవిధంగా కోటి 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టులను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇన్నాళ్లు కాంగ్రెస్, టీడీపీలే అన్యాయం చేశాయనుకుంటే ఇప్పుడు వాటికి బీజేపీ తోడయ్యిందన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కేంద్ర బలగాలను మోహరింపజేశారని, కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకున్న నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. సమావేశంలో వి.ప్రకాష్, శ్రీధర్ రావు దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాగృతి సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అందులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరించి, కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ -1 పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. గోదావరి - మూసీ ప్రాజెక్టును మల్లన్న సాగర్ నుంచి కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నుంచి చేపట్టాలని సూచించారు.

డాబర్ కొత్త కలబంద జెల్ విడుదల

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కొత్త డాబర్ కలబంద జెల్ వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న చర్మ సంరక్షణ అవసరాలను తీర్చడానికి సహజ సంరక్షణను శాస్త్రీయ ఆవిష్కరణతో మిళితం చేస్తుంది భారతదేశపు ప్రముఖ నేచురల్ హెల్త్ అండ్ పర్సనల్ కేర్ కంపెనీ డాబర్ ఇండియా లిమిటెడ్ 100శాతం స్వచ్ఛమైన కలబంద జెల్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. హైలురోనిక్ ఆమ్లంతో సమృద్ధిగా ఉన్న కొత్త డాబర్ అలోవెరా జెల్ వినియోగదారుల అభివృద్ధి చెందుతున్న చర్మ సంరక్షణ అవసరాలను తీర్చడానికి సహజ సంరక్షణను శాస్త్రీయ ఆవిష్కరణతో మిళితం చేస్తుంది. డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్-స్కిన్ కేర్ విరాట్ ఖన్నా మాట్లాడుతూ, "కలబంద శతాబ్దాలుగా నమ్మదగిన సహజ నివారణ అన్నారు. చర్మ సంరక్షణ, జుట్టు సంరక్షణలో కలబంద కీలక పదార్థంగా మారడంతో, ఈ కొత్త ఉత్పత్తిని చాలా మంది వినియోగదారులు ఇష్టపడతారని మేము నమ్ముతున్నామన్నారు. డాబర్ అలోవెరా జెల్ రెండు సౌకర్యవంతమైన ఎస్కేయూల్లో లభిస్తుంది. రూ.50కు 60 మి.లీ, రూ.85 కు 100 మి.లీ. ప్రత్యేక లాంచ్ ఆఫర్‌గా, డాబర్ అలోవెరా జెల్ ప్రతి కొనుగోలు గులాబరి రోజ్ వాటర్ ఉచిత ప్యాక్‌తో వస్తుంది. ఇది వినియోగదారులకు మరింత విలువను జోడిస్తుంది. దేశవ్యాప్తంగా రిటైల్ ఛానళ్లలో ఈ ప్రొడక్ట్ అందుబాటులో ఉంది.

బోడుప్పల్ కమిషనర్‌గా భాధ్యతలు చేపట్టిన శైలజ

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎ. శైలజ శుక్రవారం ఉదయం భాధ్యతలు చేపట్టడం జరిగినది. జి.ఎచ్.ఎమ్.సి. సంతోష్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ. శైలజ బదిలీ మీద బోడుప్పల్ నగర పాలక సంస్థకు రావడం జరిగినది. ఇప్పటి వరకు కమిషనర్‌గా భాద్యతలు నిర్వహించిన జి. రామలింగం బదిలీపై భువనగిరి మున్సిపాలిటీకి వెళ్లడం జరిగినది.

గాలి పోచమ్మ ఆలయంలో కొలను పూజలు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: అమ్మవారి దీవెనలు, ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం గాజులరామారం 125 - డివిజన్ దేవేందర్ నగర్‌లోని గాలి పోచమ్మ ఆలయం నందు శుక్రవారం పదవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశిస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎమ్ సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గొంగుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్ 7 స్పైసెస్ హోటల్ ప్రారంభం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద అంబర్ 7 స్పైసెస్ హెూటల్‌ను మాజీ మేయర్ అమర్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ ప్రాంతంలోని ప్రజలకు మరింత రుచికరమైన, ఉత్తమమైన భోజన సేవలను అందించేందుకు ఈ హెూటల్ ఉపయోగపడుతుందనే నమ్మకం ఉందన్నారు. నూతన వ్యాపారాలకు ప్రోత్సాహం అందించడం మంచి పరిణామం అని అన్నారు. హెూటల్ యాజమాన్యం మాట్లాడుతూ స్వచ్ఛమైన, హైజీనిక్ వాతావరణంలో భోజన సేవలను అందించడమే మా లక్ష్యం అని అన్నారు. వివిధ రకాల స్పైసీ, సాంప్రదాయ వంటకాలతో ఈ హెూటల్ ప్రత్యేకతను చాటుకుంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి సతీష్, హెూటల్ యాజమాన్యం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఊసే లేదు

- గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా భారత్
- పార్లమెంటులో రాష్ట్రపతి స్వోత్కర్ష

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలనుద్దేశించా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఆరంభంలోనే ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించే మహా కుంభమేళను ప్రస్తావించారు. తొక్కిసలాట మృతులకు సంతాపం తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళు లర్పించారు. ఈశాన్య భారతం గురించి ప్రస్తావించారు కానీ హింసతో అట్టుడిన మణిపూర్ ఊసెత్తలేదు. అధిక ధరలు, నిరుద్యోగం వంటి కీలక అంశాల గురించి మాట్లాడలేదు. రైతు ఆత్మహత్యలు, విద్యార్థి ఆత్మహత్యలను ప్రస్తావించలేదు. ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తూ స్వోత్కర్ష భరితంగా తన ప్రసంగాన్ని ముర్ము సాగించారు. సైబర్ నేరాలు, డీప్ ఫేక్ ముప్పు, భద్రతా సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటివి దేశ సామాజిక, ఆర్థిక, జాతీయ భద్రతకు పెద్ద సవాళ్లుగా మారుతున్నాయన్నారు. ఈశాన్య రాష్ట్ర ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. 10శాతం ఒప్పందాలు జరిగాయని అన్నారు. మణిపూర్ గురించి ఒక్క మాట మాట్లాడలేదు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని, గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్ హౌస్‌గా దేశాన్ని నిలపాలన్నదే లక్ష్యమని ముర్ము వక్కాణించారు. మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని, అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించామని చెప్పారు. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. కృత్రిమ మేధ రంగంలో రాణించేందుకు 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టామన్నారు. దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ఎంఎస్‌ఎంఈలకు రుణ హామీ పథకాలు, ఈ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్ కింద 91 లక్షలకుపైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత, మూడు కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చే లక్ష్యంతో ముందుకెళు తున్నట్లు చెప్పారు. మానవ సహిత గగన్‌యాన్ ప్రయోగానికి భారత్ సిద్ధమవుతోందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా భారత్ నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్లను ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ మందులపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశామని, గర్భిణులు, పిల్లల వాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించామని రాష్ట్రపతి తెలిపారు. సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని, వాతావరణ సమాచారాన్ని అందించేందుకు 'మిషన్ మౌసం'ను ప్రారంభించామని, సహకార రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఆమె అన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయని చెప్పుకున్నారు. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు మూడు స్తంభాలన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత, నక్సల్స్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నామని చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ప్రపంచానికి భారత్ ఆదర్శమని, 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని రాష్ట్రపతి ముర్ము వెల్లడించారు.

ప్రజా సమస్యల ప్రస్తావనే లేదు

రాష్ట్రపతి ప్రసంగంపై సీపీఐ

న్యూఢిల్లీ: వాస్తవాలకు దూరంగా, స్వీయ అభినందలభరితంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం సాగిందని భారత కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది. ప్రజా సమస్యల ప్రస్తావనకే రాలేదని దుయ్యబట్టింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం వేళ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగంలో కీలక అంశాలన్నీ విస్మరణకు గురయ్యాయని సీపీఐ విమర్శించింది. స్వోత్కర్షకు ఆమె ప్రసంగం పరిమితమని వ్యాఖ్యానించింది. సామాన్యుల జీవితాలను దుర్భరం చేసే అంశాలను, పరిపాలన వైఫల్యాలను, దేశ ప్రస్తుత వాస్తవ పరిస్థితులను గురించి ఏమీ మాట్లాడలేదని దుయ్యబట్టింది. మణిపూర్ సంక్షోభం, పేపర్ లీకేజి ఘటనల ఊసే లేదని పేర్కొంది. ఉద్యోగావకాశాల కల్పనలో పాలక పక్ష అసమర్థత, తారస్థాయికి చేరిన నిరుద్యోగం గురించి ఒక్క మాటైనా రాష్ట్రపతి మాట్లాడలేదని దుయ్యబట్టింది. కోట్లాది మంది పౌరుల జీవితాలను ప్రభావితం చేసే వాస్తవాలను విస్మరిస్తూ... కేవలం గొప్పలు చెప్పుకోవడమే పనిగా రాష్ట్రపతి ప్రసంగించినట్లుగా ఉందని సీపీఐ విమర్శించింది.

'అధిక ధరలతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. భారత్‌లో విదేశీ రుణం 700 బిలియన్ డాలర్లను దాటడం ఆందోళన కలిగిస్తోంది. రూపాయి విలువ పడిపోతోంది. ఆర్థిక వ్యవస్థను అస్థిరంగా ఉంది. ప్రమాద ఘంటికలు మోగించే ఇలాంటి సమస్యలు ఉన్నప్పటికీ... అసలు కష్టాలు, సమస్యలే లేనట్లుగా దేశం సుభిక్షంగా ఉన్నట్లు రాష్ట్రపతి మాట్లాడారు. భారత్ ఆర్థిక స్వావలంభన, వృద్ధిపై గొప్పలు చెప్పుకున్నారు. ప్రభుత్వ విధానాల్లో లోటుపాట్లు, వైఫల్యాలను కప్పిపుచ్చుకున్నారు. చేదు నిజాలన్నీ విస్మరించారు. కార్పొరేట్లపై ప్రేమ ఒలకపోయడం, పర్యావరణం క్షీణిస్తుండటం, దేశంలో అసమానలు, సామాజిక అనిశ్చితి పెరుగుతుండటం గురించి కనీసం ప్రస్తావించలేదు' అని సీపీఐ దుయ్యబట్టింది. 2015-25లో బడా కార్పొరేట్లకు రూ.14లక్షల కోట్ల మేర రుణ మాఫీ జరిగినప్పటికీ మౌలిక రంగాభివృద్ధికి కానీ ఉద్యోగ సృష్టికి కానీ వారి నుంచి పెద్దగా తోడ్పాటు అందిన దాఖలాలు లేవని వ్యాఖ్యానించింది. గత దశాబ్ద కాలంలో కొన్ని వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులను భారత్ కోల్పోయిందని గుర్తుచేసింది. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ పాలనలో మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలపై ఆకృత్యాలు, దురాగతాలు అనేకరెట్లు పెరిగాయని సీపీఐ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది.

ఎంఎస్‌పీ, సామాజిక ఘర్షణలు పట్టవా: ఎంపీ సంతోశ్ కుమార్

రాష్ట్రపతి ప్రసంగంపై సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ స్పందిస్తూ రైతుల సమస్యలు, సామాజిక అసమానతలు, ఘర్షణలు పట్టవా అని ప్రశ్నించారు. రైతుల పోరాటం, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత, ఆల్ టైమ్ రికార్డుకు చేరిన సామాజిక ఘర్షణలకు రాష్ట్రపతి ప్రసంగంలో చోటు దక్కలేదని వ్యాఖ్యానించారు. 'మహా కుంభమేళలో తొక్కిసలాట జరిగి 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమే అయినా దీని వెనుక తీవ్రమైన నిర్వహణ లోపం ఉంది. పోలీసులపై, సంస్థలపై నెపం నెట్టి తమ తప్పులను యూపీ ప్రభుత్వం చాకచక్యంగా కప్పిపుచ్చుకున్నది' అని విమర్శించారు. మణిపూర్‌లోని వాస్తవాలను ప్రజల ముందురకు తెచ్చేందుకు ప్రయత్నించిన కార్యకర్తలపై ఉక్కుపాదం మోపారని గుర్తుచేశారు. వాస్తవాలను విస్మరిస్తూ కేవలం గొప్పలు చెప్పుకుంటూ తమ భుజాన్ని తామే తట్టుకునే పద్ధతిలో రాష్ట్రపతి ప్రసంగం ఉందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ఎంఎస్‌పీకి చట్టబద్ధత, మత ఘర్షణలు వంటి కీలక అంశాల ప్రస్తావనకు రాలేదని సంతోశ్ కుమార్ అన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా...

- ఉస్మానియా ఆసుపత్రికి శంకుస్థాపన
- 26 ఎకరాల్లో 2 వేల పడకలతో నిర్మాణం

విశాలాంధ్ర - హైదరాబాద్: గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. 26 ఎకరాల విస్తీర్ణంలో 32 లక్షల చదరపు అడుగుల్లో, రెండు వేల పడకల సామర్థ్యంతో ఆసుపత్రి నిర్మాణం చేపటనున్నట్లు సీఎం వెల్లడించారు. కార్పొరేట్ ఆసుపత్రిని తలదన్నేలా ఈ నిర్మాణం ఉంటుందన్నారు. తొలుత పైలాన్ ఆవిష్కరించిన అనంతరం ఉస్మానియా నూతన భవన ఫోటో ప్రదర్శనను సీఎం తిలకించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు,హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వైద్యారోగ్య చరిత్రలో కొత్త శకం

తెలంగాణ వైద్యారోగ్య చరిత్రలో మరో కొత్త శకం ప్రారంభం కానుంది. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు. అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆసుపత్రి సమీపంలో ఫైర్ స్టేషన్, ఆసుపత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, దివ్యాంగులు ఆసుపత్రిలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్లు వంటి సమస్త సౌకర్యాలతో అత్యాధునికంగా నిర్మించనున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, కర్నాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించే ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని ప్రజా ప్రభుత్వం సంకల్పించింది. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా కొత్త ఆసుపత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు.

జాతీయ భాషాభివృద్ధికి చర్యలు

సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్‌కు పూర్తి సహాయ సహకారాలను అందజేయడంతో పాటు హిందీ బోధన పోస్టుల భర్తీ, హిందీ భాషాభివృద్ధికి తగిన చర్యలు తీసుకుం టానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఏపీ సచివాల యంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ డైరీలను చంద్రబాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి సీఎం చంద్రబాబును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సీఎంకు వినతి పత్రం అందజేస్తూ హిందీ ప్రచార సభ హైదరాబాద్ నిర్వహించే కోర్సులు, హిందీ భాషాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషను ప్రవేశ పెట్టాలని, పీజీ వరకు హిందీ భాషను విద్యార్థులు చదివే అవకాశం కల్పించాలని కోరారు. సీఎం స్పందిస్తూ హిందీ భాష ఆవశ్యకతను కాపాడతామన్నారు. జాతీయ భాష హిందీ నిర్లక్ష్యం కాకుండా రాష్ట్ర ప్రభుత్వంగా తమ వంతు కృషిని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ కోశాధికారి గిరిధర్‌రావు, తెలంగాణ హిందీ ప్రచార సభ సెక్రటరీ ఎ.కె.రాజు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

తపన్ బోస్ కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త తపన్ బోస్ (78) కన్నుమూశారు. దేశ రాజధానిలోని తన నివాసంలో ఆయన తుది శ్వాస విడిచారు. బోస్ అంత్యక్రియలు శుక్రవారం లోధి రోడ్ శ్మశానంలో ముగిశాయి. ఆయనకు భార్య రీటా మన్‌చంద్రా, కుమార్తె దేవ్‌జాని సైని ఉన్నారు. బోస్ మృతికి పాకిస్థాన్ ఇండియా పీపుల్స్ ఫోరం ఫర్ పీస్ అండ్ డెమొక్రసీ సంతాపం ప్రకటించింది. దక్షిణాసియాలోనే పేరొందిన రచయితగా బోస్‌ను శ్లాఘించింది. ఎందరో యువ దర్శకులకు ఆయన ఆదర్శమని పేర్కొంది. తపన్ బోస్ డాక్యుమెంటరీ డైరెక్టర్. యాన్ ఇండియన్ స్టోరీ ఆన్ భాగల్పూర్ బైండింగ్స్ (1981), భోపాల్: బియాండ్ జినోసైడ్ (1986), జార్ఖండ్ (1993), ది ఎక్స్‌ప్రెండబుల్ పీపుల్ (2016) వంటి డాక్యుమెంటరీలతో పేరు తెచ్చుకున్నారు. కార్యకర్తలు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులు, కళాకారులతో పాటు దేశం కోసం తుది వరకు కష్టపడ్డారు. భారత రాజ్యాంగ హేతువాద స్ఫూర్తి బలోపేతానికి, అణచివేత వ్యతిరేక పోరునకు కట్టుబడ్డారు. నక్సల్ ప్రభావిత క్షేత్రాలతో పాటు కశ్మీర్ వంటి ప్రాంతాల్లో శాంతి చర్చల కోసం పాటుపడ్డారు. గోధ్రా అల్లర్లు, బాబ్రీ మసీదు విధ్వం సాన్ని వ్యతిరేకించారు. ఆయనకు బలూచిస్థాన్, బర్మ, కశ్మీర్, నాగా ప్రాం తాలతో సత్సంబంధాలున్నాయి. శ్రీలంకలో తమిళు ల ఉద్యమంలోనూ బోస్‌కు పాత్ర ఉంది. కార్మిక సంఘాల ఉద్యమాలకు, మత్స్యకారులకు, అటవీ కార్మికుల ఉద్యమాలకు ఆయన మద్దతి చ్చేవారు. పెట్టుబడిదారీ వర్గం అణచివేసే వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిన తపన్ బోస్ మరణం తీరనిలోటని సన్నిహితులు సంతాపం తెలిపారు.

4న రథసప్తమికి భారీ ఏర్పాట్లు

3 నుంచి 5 వరకు ఎస్ఎస్‌డీ టోకెన్ల నిలిపివేత: టీటీడీ

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమలలో ఫిబ్రవరి 4న జరగబోయే రథసప్తమి(సూర్య జయంతి)కి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఆ రోజున 2-3 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. అన్నమయ్య భవనంలో చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. రథ సప్తమికి ఏర్పాట్లపై చర్చించారు. ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, వృద్ధులు, దివ్యాంగులు, ప్రివిలేజ్ దర్శనాల రద్దు, ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల రద్దుతో పాటు ప్రముఖులకు మినహా వీఐబీ బ్రేక్ దర్శనాల రద్దుకు నిర్ణయాలు తీసుకున్నట్లు నాయుడు అనంతరం తెలిపారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్ఈడీ) టిక్కెట్లు ఉన్న భక్తులు నిర్ణీత సమయంలో మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద రిపోర్ట్ చేయాలని నాయుడు కోరారు. 1,250 మంది పోలీసులు, వెయ్యి మంది విజిలెన్స్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఆక్టోపస్, ఏపీఎస్పీ, అగ్నిమాపక దళాన్ని సిద్ధంగా ఉంచుతున్నట్లు చెప్పారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. భక్తుల సౌకర్యార్థం చక్రస్నానానికి పుష్కరిణీలో ఎన్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, సాంబారు, పెరుగు అన్నం, పులిహోర, పొంగలి వంటి అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. ఎనిమిది లక్షల లడ్డూల తయారు చేస్తున్నామని (నాలుగు లక్షల లడ్డూల బఫర్ స్టాక్) చెప్పారు. శ్రీవారి వాహన సేవలు, పుష్పాలంకరణలకు ఏర్పాట్లు చేశామని, భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు 'పబ్లిక్ అడ్రెస్ సిస్టం' అందుబాటులో ఉంటుందని చైర్మన్ చెప్పారు. దాదాపు 2500 మంది శ్రీవారి సేవకులను భక్తుల సేవకు వినియోగిస్తామన్నారు. సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అరకు ఉత్సవ్

విశాలాంధ్ర-అరకులోయ (అల్లూరి): అరకు చలి ఉత్సవ్ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా పద్మపురం గార్డెన్స్ నుంచి కళాకారుల 5కె రన్‌ను జెండా ఊపి కలెక్టర్ దినేశ్ కుమార్ ప్రారంభిం చారు. ఉత్సవాన్ని పురస్కరించుకొని అరకులోని పర్యాటక ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు, మణిపూర్, నాగాలాండ్, చత్తీస్‌గఢ్, ఒడిశా సహా 10 రాష్ట్రాల గిరిజన కళాకారులు ఈ ఉత్సవ్‌లో పాల్గొంటున్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే ఉత్సవంలో ఆయా రాష్ట్రాల గిరిజన నాగరికతకు చెందిన స్టాళ్లు ఏర్పాటు చేశారు. నృత్య ప్రదర్శనలు, ఫ్లవర్ షోలు ఆకట్టుకుంటున్నాయి. హెలీకాప్టర్, బెలూన్, గ్లైడర్ రైడ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.